పట్టాభిరామయ్య, బుద్ధవరపు

మాతృదాస్యవిమోచనము : గరుత్మంతుని చరిత్ర

ధవళేశ్వరము, 1924

Record no. 151

Paṭṭābhirāmayya, Buddavarapu

Mātṛdāsyavimōcanamu : Garutmantuni Caritra

Dhavaḷēśvaramu, 1924

Record no. 151

Bibliographic Record Target

పట్టాభిరామయ్య, బుద్ధవరపు.
మాతృదాస్యవిమోచనము : గరుత్మంతుని చరిత్ర / గ్రంథకర్త బుద్ధవరపు పట్టాభిరామయ్య. - 1. ముద్రణ. - ధవళేశ్వరము : స్కేప్ అండ్ కంపెనీ, 1924.
(4), 97, (1) p. ;19 cm.
Record no. 151

Paṭṭābhirāmayya, Buddavarapu.
Mātṛdāsyavimōcanamu : Garutmantuni Caritra / granthakarta Buddavarapu Paṭṭābhirāmayya. - 1. mudraṇa. - Dhavaḷēśvaramu : Skēp aṃḍ Kampenī, 1924.
(4), 97, (1) p. ;19 cm.
Record no. 151

శ్రీ

మాతృదాస్యవిమోచనము.

గరుత్మంతుని చరిత్ర.

౫ అంకముల నాటకము.

గ్రంథకర్త.

బుద్ధవరపు పట్టాభిరామయ్య,

ధవళేశ్వరము.

ప్రథమ ముద్రణము.

క. సుబ్బారాయుడు బ్రదర్సుచే

స్కేప్ అండ్ కంపెనీలో ముద్రితము.

౧౯౩౪.

వెల అ ౦—౧౨—౦

గ్రంథకర్త యనుమతిలేనిదే యీనాటకము
నెవ్వరు నాడరాదు.

కృతిసమర్పణము.

కీర్తిశేషులు

పూజ్యులైన

బుద్ధవరపు చిన్నకామరాజు పంతులు నాన్నగారి

కీ గ్రంథకుసుమము

నర్పణము సేయుచున్నాను.

గ్రంథకర్త.

పీఠిక

మాతృదాస్యవిమోచనమను నీగరుత్మంతుని పుణ్యచరిత్రమును నేనే ప్రథమమున నాటకముగా వ్రాయుభాగ్యము తటస్థించినందులకు చాలధన్యుఁడను. నేనువ్రాసిన చరిత్రాత్మకములగు నాటకముల నన్నిటి దిగఁద్రొక్కి యీనాటకమే ముందుగాముద్రణాయంత్రమునెక్కుట కిది గరుత్మంతునివంటి మహామహుని చరిత్రమగుటయే కారణమని యూహించుచున్నాను.

ప్రథమపుత్రుఁ డరుణునిచే శపింపఁబడి వినత తనయక్కయగు కద్రువ కాజన్మాంతదాస్యము చేయుచుండుటయు, వినత రెండవకొడుకు గరుత్మంతుఁడు కద్రువ కోరిన సుధను తెచ్చి యిచ్చి తల్లిని దాస్యమునుండి విడిపించుటయు నిందలి యితివృత్తమగుటచే దీనికి "మాతృదాస్య విమోచన"మని పేరిడితిని.

ఈనాటకమును ౨౨-౧౦-౨3 న ప్రారంభించి 30-౧౦-౨3 వరకు ముగించితిని. రసగ్రహణపారీణులగు పాఠకమహాశయులు దీని నాదరింతురుగాక !

శ్రీనికేతనము, ధవళేశ్వరము ౨౫—౮—౨౮
ఇట్లు విధేయుఁడు,
బుద్ధవరపు పట్టాభిరామయ్య.

పాత్రములు.

—। పురుషులు. ।—

౧ కశ్యపప్రజాపతి—ఒక ఋషి.

౨ గరుత్మంతుఁడు—వినత రెండవకొడుకు, పక్షిరాజు.

౩ శేషుఁడు—కద్రువ పెద్దకొడుకు.

౪ కర్కోటకుఁడు—కద్రువ కొడుకు.

౫ ఇంద్రుఁడు—దేవరాజు.

౬ బృహస్పతి—సురాచార్యుఁడు.

౭ అగ్నిదేవుఁడు—ఒక దిక్పాలకుఁడు. దేవత.

౮ విష్ణుఁడు—వైకుంఠాధిపతి.

౯ అనూరుఁడు లేక అరుణుఁడు—వినతపెద్దకొడుకు, ఒక పక్షి.

—। స్త్రీలు. ।—

౧ కద్రువ—కశ్యపుని పెద్దభార్య.

౨ వినత—కశ్యపుని చిన్నభార్య.

కథాసందర్భమున కొందఱు వాలఖిల్యఋషులు, నాగులు, దేవతలు, దేవవేశ్యలు వత్తురు. నాగులవేషములకై వారిశిరములమీఁద పాముపడగల (అజంతుగుహలలోని చిత్రములవలె) నలంకరించిన చాలును. రవివర్మ చిత్తరువుల ననుకరింప నక్కఱలేదు.

శ్రీ

మాతృదాస్యవిమోచనము.

నాంది

దాసత్వంబు భరంబు, లోకమున నిందాపాత్ర మానం చెదన్
దా సద్వీరుఁ డెవండు నిర్జరులపై దండెత్తి, పీయూషమున్
వే సంపాదనఁ జేసి కద్రుకిడి, సాధ్వీరత్నమున్ మాత స్వే
చ్ఛాసంతోషతఁ జేయువాఁడెవని తేజో వాఁడు మిమ్మోఁచుతన్.

ప్రకృతివైచిత్ర్య మింద్రచాపమున నింపి
హిమగిరిన్ దనచిత్తము నెల్లఁ జూపి
దివిని గ్రహములఁ దనశక్తిఁ దేటపఱచు
శిల్పి, మీకు నతంబును శ్రీలనిడుత!

సూత్రధారుఁడు (ప్రవేశించి) సభ్యులారా!

బుద్ధవరపాబ్ధిసోముని పుణ్యకామ
రాజతనయుని పట్టాభిరామ సుకవి
లలితవాక్యసుధాధునీలహరిఁ ద్రావ
రసపిపాసలడంగును ద్రావిపోర ?

(సభ్యులపై పుష్పములఁజల్లి నిష్క్రమించును.)

శ్రీ

మాతృదాస్యవిమోచనము.

ప్రథమాంకము.

ప్రథమరంగము.

గంధమాదనపర్వతముమీఁద.

[కశ్యపుఁడు దీర్ఘాలోచనపరుఁడై యాసీనుఁడై యుండును.]

కశ్య — ఔరా! సంతానాపేక్ష నాభార్యల కెంత మిక్కుటముగానున్నది?

సీ. తపసిలోకేంద్రుఁడౌ దక్షప్రజాపతి
తనయలై లోకపావనతఁ గాంచి
అబ్జనాభుని యాజ్ఞనైనఁ ద్రిప్పఁగఁజాలు
దిట్టయని మదీయ చెట్టఁబట్టి,
సౌందర్యసుకుమార సౌభాగ్యములయందుఁ
గడుమిన్నలని చాల ఖ్యాతిఁగాంచి,

విమలపాతివ్రత్య విలసనంబున గౌరి
యంతవారని లోకమనఁగ నెగడి,
బహుళవత్సరపరిమితి వనములందు
అమితసంతానవాంఛాహృదబ్జలగుచు
వినత, కద్రువ, దీక్షను వీడఁబోక,
ఘోరతప మొనరించుచున్నారలకట

తొల్లి సిద్ధకాలంబు తపంబుచేసి పుత్రకామేష్టిం జేసిన దానికి ఫలం బిప్పుడు కలుగనై యున్నదికాఁబోలు.......... కేవలము తపోదీక్షా పరతంత్రుఁడనై యున్నను నాకు—

గీ. సుతులు లేకున్నచో నిఁక గతులు లేవ
టంచు పెద్దలు వచియించినట్టి పలుకు
లంతరంగంబునకుఁ దాకినంతలోన
మనసు పరిపరివిధములై మ్రానుపడుదు.

ఆహా! తమశిశువుల బాలలీలలఁగాంచెడు తల్లిదండ్రు లెంత భాగ్యజీవనులు!

సీ. పర్యంకమున ధరాభాగముఖంబుగాఁ
బండి శిరంబెత్తు ఫణమువోలె,
కుదురు కుదిరినయంత కోమలంబగు కర
చరణంబులను బ్రాకు కరినిఁబోలి,
కుటిలగమనంబుల గునగున పరుగిడి
గున్న మామిడివోలె కొమరు గొలుపు,
కలకలమాధుర్యకలితమౌ పలుకుల
కోకిలవలె పల్కి కూర్చుముదము,
శీతలమనోజ్ఞనిస్తులప్రీతికరము
తనయ నాశ్లేషణసుఖంబు, తతవిభూష

ణంబు లాతని మృదుభాషణంబు లట్టి
సుతులఁగాంచని జనకుని బ్రదుక దేల?

చ. సుతుచిఱునవ్వు వెన్నెలల సోనల నోలలనాడి, ప్రీతిమై
యతని మృదూక్తులన్వినుచు హర్షమునొందెడు నట్టివాఁడె య
ప్రతిహతసౌఖ్యమున్ బడయు, ధర్మవిలాసవినూత్నశోభితో
న్నతరమణీయసౌధములు నారులు నిక్కపు సౌఖ్యమిత్తురే?

ఇఁక నేబోయి నాగృహిణులకు సంతానవరంబు లీయవలయును.

(నిష్క్రమించును.)

ద్వితీయరంగము.

మహారణ్యము.

[కద్రువ, వినత శుష్కశరీరములతో వీడిన కేశబంధములతో మలిన కాషాయాంబరధారిణులై యొక లతానికుంజములోఁ గూరుచుండి ఘోరతపము చేయుచుందురు.]

కీర్తన.

కద్రువ— } ప॥ వరములొసఁగి బ్రోవ! పరమపురుష రావ!
వినత— } ౧. నిన్ను మాహృదయ నీరజములను కోరి పూజింతుము నాథా! ॥వర॥
౨. కొడుకులఁగనెడు కోర్కె కలిగె కోటికోరిక లవియె మాకు ॥వర॥

[ప్రవే: కశ్యపుఁడు.]

కశ్య—(వినతాకద్రువలఁజూచి) ఓహో! ఆమలినవస్త్రము లమాటున నెట్టి తపోతేజము ప్రకాశమానమగుచున్నది? ఈయబలల కెంత పట్టుదలకలదు? వీరల కింక శ్రమకలిగింప రాదు. (సమీపించి

కళ్యాణులారా! మీకెట్టి సుతులు కావలయును? వరంబులిచ్చుటకు సంసిద్ధుఁడనై యున్నాను.

కద్రువ— } నాథా! నమస్కారము. మాపూర్వజన్మ పుణ్య
వినత— } ములవలన దేవర దర్శనభాగ్యము లభించినందుల
కు ధన్యులము. ఇంక మావాంఛితములు కరతలామలకములు గదా!

కశ్య—మీపూర్వజన్మపుణ్య మెట్లున్నను మీరు చేసిన యీ ఘోరతపము నాతపమును భంగపరచి నన్ను పుత్రవాంఛానురక్తునిఁగావించి నాహృదయమును సంపూర్ణముగ మీవంకకు మరల్చివైచి నేను మీకు వరంబులిచ్చువరకు నన్నస్థిరునిఁగావించుచున్నది. ఇఁక తడయనేల? కద్రూ! నీకెట్టి సుతులు కావలయును?

కద్రు—ప్రాణపతీ! నాకు రూపంబున నెక్కరీతినయుండు బలాఢ్యులగు వేగురపుత్రులఁ బ్రసాదింపఁ బ్రార్థించుచున్నాను.

కశ్య—అట్లేయగుఁగాక! వినతా; నీకెట్టివారు కావలయును?

విన—జీవితేశ్వరా! నాకు కద్రువతనూజులకన్న వీర్యవంతుల, తేజోరూపగుణశేముషీవంతుల నిరుపుర మాత్రమే ప్రసాదింప వేడెదను.

కద్రు—(తనలో) కద్రువతనూజుల మించిన కొడుకులు నీకు కావలయునేమి? నీదురాశకు ఫలమును త్వరలో రుచిచూచెదవులే! కద్రువసంగతి నీకప్పుడు తెలియఁగలదు.

కశ్య—(తనలో) కద్రువకప్పుడే హృదయకుహరమందు మాత్సర్యానలము రగులుకొనుచున్నది. మధ్యకాలమందెట్లును వినతను కద్రువ దాసినిఁజేసికొని తనపగ సాధింపఁదలఁచునుగాని తుదకు—

గీ. అరుల సాధింప సాధనంబగును వారి
దాసులుగఁ జేయుటేయని తలఁచువారు

సర్వముం జెడి తమ వినాశనము తామె
తెచ్చుకొనువారలని నీతిఁ దెలియఁ జేతు.

(ప్రకా) వినతా! అసాధ్యపుకోరిక కోరితివే యని చింతించుచున్నాను. ఇచ్చెదనని ముందు చెప్పి దానిని పిదప మానఁదగదుకదా! కానీ! నీకోరిక సఫలమగుఁగాక! లతాంగులారా! మీరు తేజోధికుల ధరింతురుగాన మీగర్భంబులు చక్కఁగ కాపాడుకొనుఁడు.

సీ. పున్నామనరకంబు పూరనిధిన్ దాట
తనయుండు యానపాత్రంబుగాఁడె?
రమణీరమణ ధర్మపత్నియు సహకారావ
నిజఫలంబు తనూజుఁడుకద?
హృదయవ్యథానలమెల్లఁ బోకార్చెడు
శుభ్రహిమాంబువుల్ సుతుఁడుగాఁడె?
దంపతుల యశోపతాకమై భువిఁగ్రాలు
కూర్మిబంధువరయ కొడుకుగాఁడె?
ఎవనిజన్మంబునన్ జేసి యెల్లయెడల
గౌరవము కల్గునతఁడు కుమారుఁడుకద?
అట్టి కొమరులు మీకింక పుట్టుచుండ
శౌరిఁదలఁచుచు మనుఁడీరుదారలార

కద్రు— } ధన్యోస్మి, ధన్యోస్మి. తమ యాజ్ఞానుసారమే
విన— } చేయుదుము.

కశ్య—మనమింక ఆశ్రమంబులకుఁబోవుదమా?

కద్రు— } చిత్తము.
విన— }

కశ్య.—పరమేశ్వరకృపారసేచనంబున మీగర్భంబులు పవిత్రములగుఁగాక! రండు. పోదము. (అందఱు నిర్గమింతురు.)

తృతీయరంగము.

వినతకుటీరము—రాత్రి.

[ఎదుట రెండు కడవలలో రెండు తెల్లని అండములు కనఁబడుచుండును. వానియెదుట వినత వ్యాఘ్రాసనమునఁ గూరుచుండి దీర్ఘాలోచన చేయుచుండును.]

విన—ఏమి యీకద్రువ సౌభాగ్యము? అబ్బ ఒకరా, ఇద్దరా? వేయుమంది తనయులా? ఇందరితో కలిసి యది సముద్రతీరమున విహారములా? ఏమిదానివిలాసము! అది యిట్టిసంపత్తులను నోచుకొనుటకు నేను నోచుకొనకపోవుటకు నదిచేసిన పుణ్యమేమి నేనుచేయనిదేమి? ఆనాఁడు వెఱ్ఱినై ప్రాణనాధు నిరువురసుతుల కోరితిని గాని యనుభవమునకు వచ్చినపిదప పదుగురుకొడుకులఁ గన మనసగుచున్నదే! ఇఁక నేమిలాభము? కార్యము మిగిలినప్పుడు విచారించుట చేతులు కాలినపిదప నాకులపట్టుకొనుట వంటిది కాదా? అవును కాని .....దీనికేమి కారణము? కద్రువయు నేను నొక్కసారియే గర్భము లధరించితిమి. కాని దానికప్పుడే వేయుమంది తనయులు! నాకు పాషాణములవలె రెండండములేగాని కొడుకులేల లేకుండనుండవలయును? ఎంతకాలమునకీ యండములు పగులునని యోపికపట్టవలయును? అక్కగారి యండములు పగిలినప్పుడే యివియు చితికి యుండును. కాని యివి బిడ్డలుకాఁదగినంత వేడిలేక యిందలి యర్భకులు సంపూర్ణావయవకలితులయ్యును బయటకు రాలేకున్నారు. ఏదియైన నపాయములేని యుపాయమాలోచించి త్వరలో నివి చితుకునట్లు చేయవలయును. వేడి తగినంత కలుగఁజేయు మార్గమరయుట నాకు సుకరముకాదు. కాన నొకయండము నొకరాతితో పెకల్చి లోనివాఁడెట్లున్నాఁడో చూచెదనుగాక. ఈప్రయత్నము జయప్రదమయ్యెనా రెండవయండమునుకూడ నట్లే యొనరింతును...అపాయమో అపాయ

మోయని నేనేల మాటికిమాటికి శంకింపవలయును? సత్యఋషియగు నాధుఁడు నాకిరువురు కొమరులు కలుగుదురని వరమిచ్చుటయేమి, యది వ్యర్థమగుటేమి?.....వీనికి నేను బలిమిని జన్మము గలిగించితినని ప్రజలు నన్ను పరిహసించి నిందింతురుకాఁబోలు! వారిచిత్తము వచ్చినట్లు పరిహసింపనీ! నిందింపనీ! అంతమాత్రమున నాపుట్టి యేమి మునిఁగినది? సుతోదయానందము ముందర నివియన్నియు నన్ను బాధింపఁగలవా? కల్ల. కల్ల. అట్టిసమయమున సత్వరకుమారోదయమునకై నేనువ్విళులూరుట దోషమగునా? పుత్రగర్వియగు సోదరి చెంత గొడ్రాలివలె నేనెంతకాలము సంతానసౌభాగ్యానంద మొందక మననేర్తును? ఈకార్య మీరాత్రియే చేసిన నేరికినీ దెలియదు. రహస్యకార్యాచరణులకు కన్నతల్లివగునో రాత్రీ! నీవు నేఁడు శరణ్యమగుము.

(ఒకరాతితో నొకయండమును గొట్టును.)

విన—అబ్బ! ఇది యెంతకఠినముగా నున్నది? (ఒడలుపులకరింప) అదియేమొకాని యీయండమును బద్దలుగొట్టుచుండ నాహృదయమే బద్దలగుచున్నట్లున్నది?.....నాకు భయమగుచున్నది! నేనీకార్యము నెట్లుచేయఁగలను?.....(దృఢస్వరముతో) ఏమీ! నేనొకశిశుహత్యకార్యమున కొడిగట్టుచున్నట్లు భయపడుచున్నానేమి? ధైర్యము వహించి యీకార్యనిర్వాహణమునకుఁ గడంగి నడుమ నధైర్యపడి దానిని మానివేయుటా! ఛా! ఇట్టివే యధముల లక్షణములు!

(అండమును భేదించును, అందుండి మహాతేజస్వియగు అనూరుఁడు వెడలును. వినతభయవిషాదాశ్చర్యములచే నిశ్చేష్టురాలై యుండును.)

అనూ—హా! హా! ఎంతఘోర మొనరించితివి?

గీ. ఎవ తెయొడ మత్సరంబున నింతి ! నన్ను
చెనటివై వికలాంగునిఁ జేసినావొ
ఆమె కేనూఱువత్సరా లంతరించు
దాఁక శాపభరంబున దాసినగుదు.

తల్లీ ! అసూయాపిశాచప్రేరితవై మాజనకునాజ్ఞాధిక్కారమునకు నొడిగట్టి నన్నూరుని గావించి వికృతరూపుని చేసివైచితివి. కానిమ్ము. ఇప్పుడైన నీహృదయమును జిక్కఁబట్టియుంచుము. ఈ రెండవయండమును మాత్రము భేదింపకుము. వివేకఫలవృక్షకుఠారమగు నాతురంబునకు గురివై చేయరానికార్యమునకు దోసిలొగ్గి అలోకసామాన్యభుజవీర్య సంపన్నుండగు నీప్రథమ తనూజుని జీవితసర్వస్వమును నాశనము చేసివేసితివి. ఇపుడైన విజ్ఞానివై యీయండమును పదిలపఱచుకొనుము. ఈయండమున నన్ను సర్వవిధముల మించిన యొక మహానియతేజుండు కలఁడు. ఆతండే నీదాస్యవిమోచనము చేయువాఁడు. నా తెన్నున నే నరిగెదను. నీవూరడిల్లుము. ప్రీతియుండిన నీకుమరలఁ గన్పించెదను. లేదా నేటితో మనకు శాశ్వతవిశ్లేషమే ! నమస్కారము.

(వినువీథికేగును.)

వినత—అయ్యో ! అయ్యో ! అదియేమి ! పోయెదవా? పోయెదవా ? తండ్రీ ! నీకే నేను హేయనైతినా ? నన్ను వీడిపోఁదగునా ? అన్నా ! నాగర్భమునఁబుట్టి నా యపరాధలేశము నెక్కటియు సహించి క్షమింపఁజాలవా ? ఈభూలోకరాక్షసిని—ఈఘోరకర్మురాలిని—ఈశిశుద్రోహురాలిని—ఈసుష్క జీవితను—తనయా ! తనయా ! నీవు గాకున్న నన్ను దయామయులై క్షమించువారింకెవ్వరు ? పుత్రార్థినినై అనేక సహస్రవర్షంబులు చేసిన దారుణతపంబిట్లు బూడిదలోని పన్నీరు కావలసినదా ? నీతివిహీనురాలనై, ఆతురంబున

కుఁదోడు అసూయావేశనై, అజ్ఞానాంధురాలనై ఈహృదయవిదారుణ కృత్యమునకుఁ బాల్పడినమాట. నిక్కువము నాకింక నిరాశాకూపమే శరణ్యమా ? అర్కప్రతిమాన దివ్యతేజోవిరాజితుండవగు నీవు నా పాలిటి కౌస్తుభమనుకొంటినే ? అట్టినాయాశ లడియాసలఁ జేసితివా ? నాకడుపున బడబానలమునుంచి పోయితివా ? అయ్యో ! ఈహృదయ నిర్వేద మెవ్వరితోఁ జెప్పుకొందును ? నా కికదిక్కెవ్వరు? నన్నెవ్వరుగాచువారు ?—దయఁ జూచువారు—తల్లీ యను సుధామధురాక్షరములఁ బిలుచువారు ? అక్కటా ! నాబ్రదుకెంత చెడిపోయినది ? ఇంకనల్వురిలో నెట్లు తలనెత్తుకొని తిరిగెదను ? ఇది నాగ్రహచారమా ? పాపఫలమా ? కొమరులు లేనిదానని చీటికిమాటికి సోదరి యాడు ఎత్తిపొడుపువాక్యములకుఁదోడీ లోకనిందకూడ నానెత్తిపైఁబడి నన్ననవరత మవనతమస్తకంజేయ నెట్లు సహింపఁగలను ? కుమారా ! నీవంటి మహాతేజస్విని నాకుదయచేసియు తల్లినుండి యెడబాపి యాదైవమేమి సంతోషించుచున్నాఁడో ? ఇరువురును నా నేత్రద్వయమై నన్ననంతహర్షాంభోధి నోలలాడింతురని యెంచుచుండ నాకెంతటి పాటుకలిగినది ? అరుణా ! నీయుపదేశానుసార మీయండమే యింక నామనోవిచారసాగరోత్తీర్ణ సాధనయానపాత్రమా ? హా ! హా ! ఈర్ష్యారాక్షసీ ! నాకెట్టిగతి కల్పించితివి ?

గీ. నీమహత్త్వంబునను నేఁడు నామజబలుఁ
డైనకొమరుఁడు చేతికినందివచ్చి
నట్టివాఁడు కటా ! వికలాంగుఁడయ్యె
ఓర్చితంతకు, తుదకు వియోగమగునె ?


గీ. నాకువానికి నింక ఋణంబు లేదు
ఉండిలేనట్టులయ్యె నాయొక్కకొడుకు

ఓర ! జీవనవృక్షకుఠారమీవు
కుపితయ[illegible]పిశాచి ! నీకు ప్రీతి లేదు.

దేవాదిదేవా ! విశ్వంభరా ! ఆర్తరక్షా ! నాయిరువురి సుతులలో నొకఁడు నాకుఁ గాకుండపోయినాఁడు. ఈద్వితీయాండమే నాబ్రదుకు నకాదరువు. ఈతనినిఁ గావుము. ఈయండజోద్భవుఁడే మదీయదాసీత్వ నిరాసార్థకుఁడు. మహనీయతపోవీర్యాధికుండగు కశ్యపవరప్రసూతి. దక్షప్రజాపతిదుహితాతనయుఁడు. వీనినైన కరుణించి రక్షింపుఁడు. అపరాధములను క్షమింపుఁడు.

(కూలఁబడును.)

అవనిక జారును.



శ్రీ

మాతృదాస్యవిమోచనము.

ద్వితీయాంకము

ప్రథమరంగము.

సముద్రప్రాంతము—ప్రభాతము.

[కద్రువ, వినత సముద్రతీరమున విహరించుచుందురు.]

విన—అక్కా ! కద్రూ ! ఈసాగరప్రాంతస్థితరమ్యదృశ్యము నానేత్రములకెప్పుడు క్రొత్తగనే కనుపడుచుండును సుమా.

కద్రు—వినతా ! ఇట్టిదృశ్యములు నీకేకాదు జగత్తులో నెవ్వరి నాకర్షించి మోదవిభ్రమమును గొలుపఁజాలవే ?

గీ. సుప్రభాతంబు, సుమములు, సుదతిజనులు
అనుక్షణంబును నూతనమగుచునుండు,
జనుల సమ్మోహవశులను సలిపి, కడు ము
దము నొసంగెడు నద్దిసౌందర్యమె కద ?

విన—ఔనౌను! అక్కా! ఈమహోదధినిఁ జూచినపుడెల్ల నా

చిత్త మానందపరవశమై యుప్పొంగిపోవుచుండును. దానికెల్ల దీనిపా
వనత్వమే కారణముసుమా! ఏమా?

సీ. గంగాసరస్వతీ గౌతమీయాదియౌ
పావననదులకుఁ బాలకుండు,
కౌస్తుభ, శ్రీ, చంద్ర, కల్పద్రుమాదులఁ
జాలఁగాంచిన పుణ్య జన్మభూమి,
యోగనిద్రారూఢ భోగిపర్యంకుండు
శయనమొందెడు నట్టి స్థానభూమి,
వజ్రాయుధాహతిఁ బడనీక మైనాకు
కభయమొసంగిన యలఘుకీర్తి,
అత్రిబుషి కేని కనుఁగొన నలవికాని
యంతగంభీరమై మహావ్యాప్తిఁగాంచి,
ఘోరజలచరరావవిఘూర్ణమయిన
యబ్ధిఁగనుఁగొన దర్శనీయంబునతము.

కద్రు—నిజము నిజము.

గీ. ఫణిఫణారత్నరుచిర విభాండనంబు,
బాడబాగ్ని శిఖాచయోద్భాసితంబు,
సురమునిస్తోత్రపాత్ర విశోభితంబు
అమితమహిమాన్వితంబు రత్నాకరంబు. *

[దూరమున నొక తెల్లనియశ్వము చూపట్టును.

విన—(తొందరతో) అక్కా! అక్కా! అదెన్నఁ జూడుము. ఆయశ్వరాజ మెవ్వారిదే?

కద్రు—ఎరుఁగవటే క్షీరసాగరమథనసమయంబున బుట్టినయుచ్చైశ్శ్రవమను? అదియే యిది; ఇంద్రునిది.

* పాఠాంతరము కరముమహిమాన్వితంబు సాగరముచెలియ!

విన—ఆఁ అట్లా! ఆహా! ఈతురంగ మెంతజలిష్ఠమై యెంతమనోహరముగానున్నది. ఏమి దీనిచర్యలచిత్రము?

గీ. లలితశాద్వలతలమున నిలిచి, నగము
గొఱికినట్టితృణంబులఁ జఱచఁదిని
ఓరచూపుల మనల నవ్వారిగాఁ
జూచును చైశ్శ్రవంబును జూచినావె?

కద్రు—ఇపుడుచూడు మిపుడుచూడుము.

మ. హరిణంబట్టుల లోలనేత్రములతో నాలోకనంబున్నగన్
బరపున్నాని హృదంతరాళమున నావంతైనభీతిల్లదీ
తురగంబెంతటి వింతజంతువొకొ? పాథోరాసి జన్మించుటన్
వరగంభీరగుణంబులాజనకుదేవ న్యాసమానంబులై.

ఐంద్రజాలికునివలె నీఘోటకమునకీ విచిత్రచర్యలేమి?

సీ. వడివడిగనుబోయి వనరాసిలోఁజొచ్చి
భీతిల్ల కెదురేగు వీచికలకు
భయపడినట్టుల పరుగుపరుగున వెలి
కుఱికి కూలమువీడి యరుగునపుడె
కడుబడలినమాడ్కి పడుక వేయును కొంత
తడవు మనోహరస్థలములందు
ఉత్సాహముప్పొంగిలూఁగింపఁగాఁబోలు
చెట్టుపుట్టలనెల్ల నిట్టెదాఁటు
ఇచటి రమణీయదృశ్యముకెల్ల నన్ను
తెచ్చు దీసిమనోహర దివ్యరూపు
మనకుఁ గల్పించు నాథక్యముగద చిత్ర
వర్తనము లెంచ చతుష్పర్వంబులగుచు

వినః—హాయి ! హాయి ! ఏమి యీయశ్వరాజముసొంపు ?

చ. సకలజనామనోజ్ఞశితశారదసాంద్రసుధాంశుకౌముదీ
ప్రకటితకీర్తిఁ బోల్చి మతిరాజనిపించి, మహోన్నతప్రభా
ధకుఁడగువానికీరితిని, ధిక్కృతిఁ జేసి, వసంతమల్లికా
వికసితపుష్పరాజముల వీఁగఁగఁ జేయువలక్షుసంపదన్.

ఓహో ! మచ్చునకైన నెచ్చటను నల్లనిమచ్చయైన లేక నిది యాపాద మస్తక మెంతధవళంబై ముచ్చటఁగొల్పుచున్నది ?

కద్రు—(తనలో) ఈవినతమీఁది పగతీర్చుకొనుట కిదియే సమయము. (ప్రకా—) వినతా! నీవేకనులతోఁ జూచితో గాని యీ యశ్వంబెంతయుఁ దెల్లఁగా లేదుసుమా ?

వినః—అక్కా ! కట్టెదుటఁ గానిపించుదాని కింత యనుమాన మెందులకే ?

కద్రు—సరియే గాని, ఒకసారి దానివాలమును బాగుగ సూక్ష్మదృష్టితోఁ బరిశోధించిచూడుము. అది యించుక నల్లగా లేదా ?

వినః—బాగున్నది. సూక్ష్మదృష్టితో చూచినను స్థూలదృష్టితో చూచినను దానిలో నొక్కవర్ణముకంటె నెక్కువ లేవు.

కద్రు—సరి సరి! తెలిసినది. తెలిసినది. నీదృష్టి దూరమున నున్నవస్తువులపై నానదు కాఁబోలును. ఆనలుపు నీకింకనుకంటఁబడ లేదు గాదా ?

వినః—నీహేళనల కేమి లే! అక్కరకురాని వెఱ్ఱివెఱ్ఱివాదనలఁ జేయకుము. నేనౌననునది నీవు కాదనుట యెప్పుడు నున్నదియే !

కద్రు—కడచినవానిమాట యెందులకు గాని దీనికి మనమొక పందెము పెట్టుకొందము. నీమాట బోటైన నేమియోడెదవో చెప్పుము ; నిజానిజములు పందెమువైచుకొన్నఁగాని తేలవు.

వినః—అట్లే ! పందెమేమో నీవే నిర్ణయింపుము.

కద్రు—మనలో నోడినది తక్కినదాని కాజన్మాంతము దాసి యగునట్లు పందెము సజేచితిని. దీనికి నీకిష్టమేనా ?

వినః—సాసమ్మతమున కేమి లే. ఎట్లయినఁ జేయవచ్చును. ముందాయశ్వము సితమో యసితమో తేలుటయే ప్రధానము.

కద్రు—అట్లనిన వలనుపడదు. దాస్యముచేయుటకు—

వినః—(అర్ధోక్తిలో) నాకిష్టమే లే. అక్కచెల్లెండ్రలో నెవరెవరికి దాస్యము చేసినను తప్పు లేదు. నీపందెమునకు నేను సంపూర్ణాంగీకారము చూపుచున్నాను. (కద్రువచేయిలాగుచు) ఇంక రమ్ము. ఇప్పుడే పోయి దానినిఁ జూతము. దానితో నీవాక్యముల నైజము తేలిపోవును.

కద్రు—(కసరుచు) అబ్బ ! ఏమిదుడుకుదానవే నీవు; ఇంతసంరంభముచేసెదవు; మాధ్యాహ్నఫలాహారమునకై త్వరలో గృహాభిముఖులముగావలసిన సమయమున "వెఱ్ఱికుదిరినది రోకలి తలకుఁజుట్టుము" నట్టుల నిప్పుడే దీనివెంటఁబడి పోవలసినంత యగత్యమేమివచ్చినది ? ఆగంధర్వమిట నుండునదేగాని యెచ్చటకుఁ బోవునది కాదుగదా! రమ్ము రమ్ము.

వినః—ఎంతలో పోయి యెంతలో రావలయునే; యీమాత్రపుదాని కేమేమో సాకులు చెప్పెదవు? నేఁటియుత్సాహము రేపటనుండునా, అశ్వమున్నగాని ?

కద్రు—చాలు లే నీమాటలు. చేసినప్రతిజ్ఞతప్పి సంఘములో నపఖ్యాతిఁ దెచ్చున—

వినః—(అర్ధోక్తిలో) అబ్బ ! అది కాదే ! రేపటికి—

కద్రు—(అర్ధోక్తిలో) ఉత్సాహమాయింక! దానికేమి? ఇంతలో నేయుప్పెనయువచ్చి కొట్టుకొనిపోవదుగదా ! నీకు శ్రమయని తోఁచలేదు కాని—

విన—ఒక్క నిముసములో పోయివచ్చుటకు మనకు శ్రమయగునా?

కద్రు—వినతా! నీవెంత బేలవే? మనకు శ్రమ లేనిమాట సత్యమే కాని యెంత లేదన్న నాయశ్వమున్న స్థానమునకుఁ బోవలయునన్న నొక హోరకాలమున కెంతమాత్రము తక్కువబట్టదుగదా! అంతకాలమువరకు పసిపిల్లలు సర్పములాఁకటిచే కడుపులు కాలిపోవ నకనకలాడుచు "అమ్మా" "అమ్మా" యని హాహారున నేడ్చుచుండరా? నీకేమి యెంత కాలమైన నేమితొందర? అట్టిబాధ లేమియు లేకుండ గ్రుడ్డులోనుండగనే నీపెద్దకొడుకు బ్రతుకు బాధలు చేసితివి. వాఁడు సూర్యసారథియై లేచిపోయినాఁడు. వరములిచ్చుటయేతడవుగ మగఁడు వనములకు నడచినాఁడు. రా! రా! నీకింకను బాల్యచాపల్యము పోలేదు.

విన—సమయముదొరకినదే తడవుగ నెత్తిపొడుపు లారంభింతువు. పోనిమ్ము. రేపటనే వత్తము. (తనలో) ఇంతలో నేమగును? రేపటవిలోకించిన నన్నియు తేటపడు. తేటపడుట కేమున్నది. నాకు కండ్లు లేకున్న కద!

కద్రు—ఆఁ నంగనాచివిలే! రా! వేళయైనది.

(ఇరువురు నిర్గమింతురు.)

ద్వితీయ రంగము.

కద్రువకుటీరాంతర్భాగము.—రాత్రి.

[కద్రువ; శేషుఁడు; కర్కోటకుఁడు; తదితర నాగముఖ్యులు సభతీరియుందురు]

నాగులు—ఏమమ్మా! చెప్పుము. అది యేమో చేసెదము.

ద్రు—ఊరక చెప్పిన మాత్రమున నేమి ప్రయోజనము! మీరు దానిని విధిగ నాచరించినప్పుడే యుపయోగమున్నది కాని—

నాగులు—(అర్ధోక్తిలో) ఎందుకీవృథాసందేహము. అదియేదో చెప్పరాదా?

కద్రు—తనయులారా! అట్లయిన దానిని వివరింతును. శ్రద్ధతో వినుఁడు. వినతయు నేనును నేటిప్రొద్దుట సముద్రవిహారమునకు పోయిన సంగతి మీకు తెలియునుగదా! అచ్చట మాకు ఉచ్చైశ్శ్రవము పొడకట్టినది. అది యాపాదమస్తకము తెల్లనిదని వినతయు దానితోక నల్లనిదని నేనును వాదులాడి యాజన్మాంతదాస్యము పణముగా బెట్టుకొంటిమి. మాకు రేపటి ప్రాతఃకాలమే పరీక్షాసమయము. దానివాలము తెల్లనిదే కాని నల్లనిది కాదు అందుచే నిపుడు మీలో కొందఱుపోయి యాగుఱ్ఱపుతోకకుఁ జుట్టుకొని రేపు మేము పోయి చూచునప్పటికి నల్లగానుండునట్లు చేయవలయును. వినతకిసుమంతయైన ననుమానము కలుగని రీతిని మీరుండవలయును. దాంతో నది మనకు దాసియగును. లేకున్న నేను మీరుకూడ నామెకు దాసులగు దురవస్థవచ్చును. పుత్రరత్నములారా! మీసామర్థ్య మసమానము. మీరు కామరూపులు. మాతృప్రేమాపూర్ణహృదయులు తప్పక నాయాజ్ఞను పాలింపుఁడు. దీనికేమి చెప్పెదరు ఇంకొకమాట. మీర లొకవేళ నధైర్యము నొందియు కరుణించియు మావలనఁగాదనెదరేమో అధైర్యపడుట జాలిదలఁచుట యనునవియున్నవే యవిపిరికిపందల లక్షణములని మాత్రము మరచిపోవలదు. కార్యశూరులనిపించుకొని యీ కార్యనిర్వహణమునకు సంసిద్ధులగుఁడు.

శేషు—అమ్మా! నీకీదుర్ణయవ్యాపారమెందులకు? నీవవినీతిపథమునఁబడిపోవుటయేగాక మమ్ములఁగూడ వినాశకరమగు నీమార్గమున నడిపింపఁజూచెద వది యేటిసంకల్పము? నీకీదౌర్జన్యము కూడదు. కుడిచికూర్చుండ లేక సజ్జనుల బాధింపఁజూచెడు దుర్మతము నీకుఁదగునా?

కొ అమూలిన యీ కార్యముచే నీసహజను కడగండ్లఁ బెట్టి నీపగ సాధింపఁ దలఁచుచున్నావు కాని వేరుకాదు. ఆమె నీకేమియపకార మాచరించెన నియిట్టి యకృత్యముఁ దలపెట్టెదవు? ఈదుష్కార్యమునకు మేమెవ్వరము తోడురాము. ఇట్టిచర్యలకు సహాయులమై మాజీవితములుకళంకితములుచేసికొని మాతృద్రోహము చేయఁజాలము. నిజముగ నీయుపదేశము మమ్ముల నివ్వెరపడచేయుచున్నది.

నాగులు—అమ్మా! పెద్దన్న వాక్యములు ధర్మయుతములు. అట్లుచేయుము.

కర్కో—అట్లుకాదు. మనకు అన్నవాక్యములెక్కుడా? అమ్మవాక్యములా? అంతియేకాక అమ్మ నియోగించిన కార్యమును మనము నెరవేర్పకున్న వచ్చెడు నష్టమును యోజించితిరా? ఏమియాలోచించిరని మీరధర్మమనుచున్నారు? మేముగాదని చెప్ప సాహసించుచున్నారు?

కద్రు—కుమారులారా! నాగౌరవము నిల్పిన నేఁగల్పినను మీరే. నాకుగలుగఁబోవు మహాపదను మీరు గుర్తించినట్లులేదు. మీ ధైర్యమేమో నాకుబోధపడదు. ఆజన్మాంతదాస్యమన నేమనుకొనుచున్నారు? సగముకుళ్ళి, బ్రతుకు బగ్గముపాడై జీవించుటయన్నమాట. ఆనరకము నెవఁడనుభవింపఁగలఁడు?

నాగులు—దానికేమిగాని ముందు నీవాక్యములు నిష్కారణక్రోధవిషసిక్తములై యధర్మ విపత్కర కార్యప్రబోధములగుటలేదా? ఇదినీకుఁదగునా?

కర్కో—సోదరులారా! తల్లియాదేశము మనకెట్టిదైన నాచరణయోగ్యముకాని విమర్శనార్హముకాదు.

కద్రు—నిజము. నిజము. అట్టివారే నిజమగు మాతృభక్తులు.

శేషు—కర్కోటకా! తల్లియవినీతి నుపదేశించినను తనయులు తప్పక దానినాచరింపవలయునా? విచిత్రవాదన చేయకుము.

కర్కో—ఇందువిచిత్రమేమున్నది? దుర్నీతియేమున్నది? దండగమేమున్నది? తల్లి మహోపద్రవమునకు గురియై మనల నించుకసహాయ మడిగిన మనము నిరాకరింపవలసినదా? ఇదియేనా మీమాతృవాత్సల్యము? ఈనాటికి కద్రూమహాదేవికి తనయులవలన తగినంత సహాయసంపత్తి, సౌఖ్యము కలుగుచున్నది. పుణ్యము!

శేషు—చాలు చాలు. నీవాక్యములు దుర్యుక్తిమిళితములై యున్నవి. పినతల్లిని మోసపుచ్చుటకన్న దుర్నీతియేమి కావలయును? పినతల్లి నాజన్మాంతదాస్యపాశముల బంధించుటకన్న నేమిదుండగమున్నది? ఈఘోరకార్యభారమును మేము వహింపఁజాలము. మమ్ముల నిట్లునీవు బాధించుటకంటె తత్క్షణము వినతాదేవి కడకేగి యామెను చేసిన తప్పుక్షమింపుమని బ్రతిమాలుకొనరాదా? దానితో నీకీభారము తొలఁగిపోవును. గోటఁబోవుదానిని గొడ్డండ్రతో దీర్చువరకుఁ దెచ్చుటెందులకు?

కద్రు—ఛీ! నన్ను మీపినతల్లిని యొకబిక్షుకురాలివలె యొకయనాథవలె దేహియని యర్థింపుమందురా? నేను మీకు దుర్నీతిఁగరపితినంటిరే యిపుడు మీరు నాకు నీచతను నేర్పుటలేదా?

కర్కో—అవునవును. అమ్మ ఒరులకు బానిసగాఁజాలదు. ఆమెపరిభవము మనకు గాదా? ఆమెనీచత కొడఁబడఁజాలదు.

నాగు—తనకు ప్రతిష్ఠాలోపమని ధర్మవిదూరగామియై పినతల్లిని క్షమాపణమడుగుటయే హైన్యమని వృథావాక్యశరపరంపరల గురిపించు నీమెకు నొసటివ్రాత తప్పునట్లగుపడదు.

శేషు—కర్కోటకా! నీకు మంచిచెడ్డలు లేవు. పినతల్లిమాత్రము మనకు దాసి కావలయునా? మనముమాత్రము కాఁగూడదా? ఏ

దునీతియది! ఆహా! అన్నెము పున్నె మెఱుఁగని యమాయికురాలిని—మహోదారభావ సంపన్నురాలిని— సర్వసద్గుణ భూషణాలంకృత తృణీకృత విఘ్నరాశిని—సుతవియోగముచే వాడివత్తియగుచున్న సుశీలను—మోసముచేసి—ఆశాలతలఁ ద్రుంచి—ద్రోహముచేసి—ఆజన్మాంతము దాస్యనరకకూపమునఁద్రోసి—జీవితసర్వస్వము నాశనముచేసి—మీపగనంతను సాధింపఁదలఁచుచున్నారా? మీవి పాషాణహృదయములా? వజ్రహృదయములా? అమ్మా! అమ్మా! నామాటవినుము. కేవలము వాదనయే యశనముగా జీవించు కర్కోటకుని యుపదేశమువలన నీరక్తములోని రక్తమును పీల్చి వేయకుము శాంతించి యోజింపుము.

కద్రు—నాయనా! వినత తన్ను నుతించిన నీకేమి పసదనమిత్తునని చెప్పినదోయి! ఆమె పక్షమున నింత శ్రద్ధతో వాదించెదవు? కొడుకులో కొడుకులోయని పలవరించి వేలకొలఁది వర్షంబు లాహారము వర్జించి మహోగ్రతపము చేసి వరముల సముపార్జించి యేనూఱువత్సరములు మిమ్ముల వేసుర కడుపున భరించి పెంచి విద్యాబుద్ధులఁగఱపి పెద్దవారినిఁ జేసినందులకు నేనవినీతిపరురాలననియు, నేననినను మీరనినను కండ్లలో నిప్పులుబోసికొను గయ్యాళివినత సర్వసద్గుణపూతచరితయనియు వాకొనుతనూజులు గలిగినప్పుడు నాసాఖ్యమునకేమిలోపము? తిన్నయింటికి వాసముల నెన్ను బుద్ధిమంతులారా! వినతకు దాస్యమో వినతకు దాస్యమోయని నిలపింతురేల? ఆమె మనపోషణమందుండిన నామె తనకుమారుని పెంచుబాధ్యతనుండి బయటఁబడి సుఖింపదా? ఆజన్మింపబోవుకుఱ్ఱని ఉగ్గుమొదలు వివాహాదులవరకు—అంతవరకన్న మాటయేమి జీవితాంతమువరకు మనమే వేయికన్నులు పెట్టుకొని పాలించి పోషింపమా? ఈవిషయములనేవియు యోజింపక నేమో ధర్మపన్నములప్పగించిన ఫల

మి? శేషుని ప్రకృతియే విచిత్రమైనది. ఎంతసేపు సాత్త్వికమార్గములట; అహింసయట, మన మొరులకు—ఒరులకేగాదు అల్పులకైన మనస్సులోనైన కష్టము తోఁచునట్లు మెలఁగరాదట. తనయులారా! ఉన్మత్తుఁడును, భీరువయు, ధైర్యసాహస విరహితుఁడునగు నీతని వాక్యముల పాటింపకుఁడు. ఇతఁడు తల్లికుత్తుకయుత్తరించుకొని పోవుచున్న సామెత్వరలో పరలోకగమనము చేసినదో లేదో చూతుమని చెప్పుమహానుభావుఁడు.

శేషు—ఏమినిందాగర్భిత కార్యప్రబోధనయ వాక్యప్రయోగనైపుణ్యము! తలఁచిన కార్యమెట్టిదైన నేరీతినైన చేయ నిశ్చయించి కేవలము సహాయమర్థించుచు మాతో మాటలాడు నీకు మాధర్మోపన్యాసములు తలకెక్కునా? లేకున్న దీనికొక్క—దానికి సమాధానము జెప్పుము నీవు నిజముగ వినతాంబ బాగోగులఁగోరియే యామెను నీకు దాసీనిఁజేసికొనఁదలంచుచున్నావా? నీవామె కట్టి శ్రేయోభిలాషిణి వేయైన నేనామెను కీర్తించునప్పుడు కటకటఁబడి యామెను గట్టివాయియనియు రాగయనియు మిటారియనియు నేల నిందింతువు? అమ్మా! ఈచర్యలవలన స్వర్గమా మోక్షమా? నీ దారుణసంకల్పము నుపసంహరించుకొనుము. మనమోసము నలుగురకుఁ దెలిసెనా మనకు తీరని యపయశము తప్పదు.

కర్కో—ఓహో! ధర్మాపరావతారము! నీతలతిక్క యుపదేశములు మాచెంతఁగాదు. సోదరులారా! మీరందఱు కలిసి తల్లినెంత అవ్వపాలుచేయుచున్నారు? అమ్మయన నేమోయనుకొనుచున్నారు. తపోబలముకల మహాసాధ్వి నెదిరించి మనము మనఁగలమా? అమ్మ వాక్యములు మీరు సరిగా నర్థముచేసికొనినట్లుతోఁచుటలేదు. వినతాంబమీఁద నామెకు కోపములేదు. కాని చేసిన ప్రతిజ్ఞ తప్పిపోరాదు. గ్రహగతులు తప్పినను సరే, ఆమె తన చేసిన సమయముఁ

ధర్మునా? అందుచే వినతాంబను మనము పేరునకు మాత్రము దాసిగ నియమించుకొనక తప్పదు. అదియే కాక యొంటరిదగుట జీవన మెట్లు జరుగును? అందుచేనైన నామెను మనము పోషింపవలసినదే కదా? ఇప్పుడా పోషణమును పందెము పేరు పెట్టి విజితురాలిఁ జేసి "నీవు మాకు విధిగ దాస్యము చేయవలయునని" చెప్పి చేయుదుము. ఇది భేదము. అందుచే నిజముగా నిది వారిని మనము మోసము చేయుటయే యైనను వారికది మేలే యొనఁగూర్చును. అన్న వాక్యములు పావనచరిత్రయగు మనజననిపై ద్వేషము పురికొల్పుచున్నవే కాని యామె యెడదకు శాంతిని సౌఖ్యమును గలిగించుట లేదు. వీని వాక్యములు మాయావాగురలు. మీరు దానిలోఁ జిక్కుకొనవలదు. ఈతఁడందఱికన్న పెద్దయని యీతని యుపదేశముల నాలకింతుమా? మన మిహలోకసంబంధమును వీడి సన్యసించి పోవలయునే గాని వేరు గత్యంతరము లేదు. రండు. అమ్మ ప్రతిజ్ఞఁ గాపాడ బద్ధకంకణులగుఁడు. (తమ్ములఁ జూచి) ఊరక యిట్లుగుర్రై చూచెదరేల? నా వాక్యములు హేతుబద్ధములు కావా? నైతికోజ్జ్వలములు కావా?

నాగు—ఛీ! దుష్ప్రలాపీ! నిన్నేమి చేసినను పాపము లేదు. నీయుపదేశవిషము మాకెక్కింప నక్కఱలేదు. మేము రాము. అధర్మము మాకు వలదు. శేషన్నా! నీయభిప్రాయమేమి?

శేషు—అదియే యుత్తమమార్గము. ధర్మవిదూరులమై మనము జీవించియున్నను మృతతుల్యులమే.

కద్రు—అట్టి చండాలుర మీరు బ్రతుకనే వలదు. అనతికాలంబులో రాజాధిరాజజనమేజయకృతసర్పయాగాగ్నికుండమునఁ బడి మీరెల్లరు మలమలమాడి చత్తురుగాక! పొండు పొండు.

శేషు—పోసిమ్ము. అధర్మవర్తనులమై నీచపు జీవనముల నేటి

పుచు చిరంజీవులమై యుండుటకంటె బ్రదికిన నాలుగుదినములు న్యాయానురక్తులమై జరించుటయే మాకిష్టము.

కద్రు—(కోపముతో) మీరింక బ్రతుకునది నాల్గుదినములు గావు; మూఁడురోజులు పట్టపగలు. ఆజనమేజయుఁడు చేయు సర్పయాగసమయంబున—

గీ. భూనభంబులనుట్టుడు వేనవేల
నాలుకలతోడ దారుణానలశిఖాళి
యాగకుండమునను మిమ్ము నారగించు
నప్పు డమ్మా, యమ్మా, యనుచు నేడ్చు
నుద్ధరింపగ మిమ్మెవ్వ రురగులార!

శేషు—రండు. రండు. సోదరులారా! మనమిట నుండతగదు.

(నిర్గమించును.)

నాగులు—ఓతల్లీ! మేమెల్లరము చచ్చెదము. నీవే యిట్టిగట్టుకొని యూరేగుము.

[నాగులు, కర్కోటకుని, కద్రువను, తీక్ష్ణముగ చూచుచు నిష్క్రమింతురు.]

కద్రువ—కర్కోటకా! చూచితివా! కథ యెంతవరకు వచ్చినదో?

కర్కో—అమ్మా! వారు శేషుని మూలమున దుష్టులై పోవుచున్నారు.

కద్రువ—నీమాతృభక్తికి సంతసించుచున్నాను.

కర్కో—అమ్మా! నీవిచ్చిన శాపమువలన నేను కూడ చావవలసినదేనా?

కద్రువ—దానివలన నీకు భయములేదులే! కాని.....రేపటిమాట యేమి?

కర్కో—నేనుండఁగా నది యెంతసేపు. కృష్ణవర్ణుఁడనగు నే నొక్కఁడఁ జుట్టుకొంటినా ఆ యుశ్వము వాలము నల్లఁగా నుండుటలో నాశ్చర్యమేమి? నేనచ్చట నుంటినని యెవ్వరూహింపఁగలరు?

కద్రువ—బాగున్నది. నీకు జయమగుఁగాక! పుత్రా! నీవే నాకుఁ దగిన కొమరుఁడవు. ఆయధములు తమ వినాశనమునకైన సమ్మతించిరి కాని నావాక్యములు చెవిని బెట్టలేదు. ఏమి నిర్లక్ష్యతఁ బ్రకటించి యెంత కావరము చూపిపోయినారు!

కర్కో—అమ్మా! వారి నేఁక దలపెట్టకుము. నాకిప్పుడేమి యాజ్ఞ?

కద్రు—తెల్లవారు నప్పటి కావాఁగరతమున సంచరించు వాజివాలము నలంకరింపుము. మేము చూచునప్పుడు నీవు ఉచ్ఛ్వాస నిశ్వాసమునైన విడువరాదు. బాగుగ చీకటిపడువరకు దానినంటియుండి గాని యేకార్యమైన వెంటనే యీవలకు రారాదు. అదిగదిగో! తెల్లవారుచున్నట్లున్నదే!

కర్కో—(ఆకసమును బాగుగఁజూచి) లేదు. లేదు. వెలుతురు కుటచే నట్లున్నది. నేడు దశమిగదా!

కద్రు—అట్లుగాదు. ఎందులకైన మంచిది. నీవీక్షణముననే పోయి యటనుండవలయును. వెళ్ళెదవా?

కర్కో—ఓటిలో తలదూర్చిన పిదప తోకటిపోటునకు వెఱవవచ్చునా?

కద్రు—అయిన పద.

(ఇరువురు నిర్గమింతురు.)

తృతీయాంకము.

కద్రువకుటీరముదరినొక చెట్టుక్రింద—సాయంత్రము.

శేషు—తమ్ముఁడా! కర్కోటకా! నీకింత దౌర్జన్యము కూడదు. దానికిఁ దగిన ఫలము మన మచిరకాలమున ననుభవింపక మానము. నీ మోసము నిరాఘాటముగ సాగినది. అమ్మ విజయోన్మాదమున నెడలు తెలియకున్నది. తన సహజయనియైన నెంచక మన పిన్నతల్లిని దాసిగా గ్రహించి బాధించుట కారంభించినది. ఈవిజయమునకు మీరెల్లరు గంతులువైచుచున్నారు కాని యామెను దాసినిఁ జేసి నంత మీరు పొందుసుఖమేమి? ఇదియేగాక సమయము కలిగినపుడెల్ల తమ్ముల నందఱఁ జేర్చి వారికి నీమతము నెక్కించి యప్పుడే యందఱి నాగులకూడ కర్కోటకులఁ జేసివేసితివే? సోదరా! ఈదుర్వ్యాపారము నీకెందులకు?

కర్కో—అన్నా! జీవన్ భద్రాణి పశ్యతి యనవినవా? ప్రాణసంరక్షణముకంటె మనకు ధర్మమెక్కువదా? అమ్మ మనోరథ మీడేర్పకున్న మనలనందఱి నిర్దాక్షిణ్యాభావమున నిప్పుడే భస్మీపటలము చేసివేయదా? మనలనందఱినా జనమేజయహాతకుఁడు చేయఁబోవు సర్పయాగమునఁ జావుఁడని యింతకుపూర్వమే గొప్ప శాపమిచ్చినదికదా! అందుచే నిప్పుడైన నట్లోయామెకు హితము పలికి యిష్టమగు పనులాచరించి క్రోధోపశమనము చేసినచో నీశాపమే నాటికైనఁ గ్రమ్మరింపదాయని చూచుచున్నాను. లేకున్నచో మనపాట్లు మగనా? ధర్మమని దాక్షిణ్యమని యేమేమో యేకరువెట్టి నన్ను చంపెదవు కాని తుదకు [illegible]చెడి నీదాకవచ్చివఁగాని తెలియఁజాలవు. [illegible]గూడ నీదయాదాక్షిణ్యముల బండారము తెలియవచ్చి[illegible]మే [illegible]త్తమ

మైనదని యనుభవమునకుఁ దెచ్చుకొని యట్లాచరించుచున్నారు. దానికి నేను బాధ్యుఁడను గాను.

శేషు—ఛీ! ఛీ! మీకింక నెంతబోధించినను లాభములేదు. శ్రుతిమించి రాగమునఁ బడిపోయినారు. చెట్టుచెడు కాలమునకుఁ గుక్కమూతి పిందెలన్నట్లు చివరకు మీకీ బుద్ధులుపుట్టినవి. మీకు పరశ్రేయస్సహనమిసుమంతైన నున్నట్లులేదు. సర్వసోదరభావమసలేకనుపింపదు. క్రియలలో గాకున్న పలుకులలోకూడ నట్టిభావములు వ్యక్తపడవు. ఇదిగో చెప్పుచున్నాను వినుము. అహింసను విడనాడిన మీకు శ్రేయముండదు. చేతులు కాలినపిదప నాకుల నాశ్రయించిన నాకులపాలేకాని యావంతయు ఫలముండదు. అప్పుడే వినతాంబను పెట్టుబాధ దుస్సహము!—దుస్సహము! పైనదైవములేడా? తుదకు మీరు త్రవ్విన గోతిలో మీరేపడెదరు. ఆలోచించుకొనుఁడు.

కర్కో—(తనలో) వీనిపోరుపడలేకున్నాను. వీనివాక్యములు నన్నుద్దేశించి పలుకుచు నందఱివిషయమై చెప్పినట్లు పైకిఁగనఁబడుచుండును.

[తెఱలో కలకలము గరుత్మంతుఁడాకాశమార్గమునఁబోవుచు.]

కర్కో—ఏమిది? అదిగో పినతల్లికిఁ బుట్టినయండము పగుల నీపక్షియుద్భవమయ్యెను. ఆహా! ధనుర్విముక్త నారాచముపగిది మహావేగమున నీపక్షి యాకాశమార్గమున నెట్లుపోవుచున్నది?

శేషు—ఓహో! చూచుచుండఁగనే ఎంతలో నెంతదవ్వరిగెను?

కర్కో—ఇట్టివానిని మనమెన్నఁడైన గాంచితిమా?

గీ. కార్యవశమున నంతరిక్షంబునుండి
ధరకునేతెంచి జివ్వనఁ దరలిపోవు

దుర్నిరీక్ష్య పరిభాభాసితుండు ద్యుమణి
బోలెబోవుఖగేంద్రుఁడు మ్రొక్కలీఁడు.

(స్వగతము.)

గీ. పున్నమేమొకాని పుట్టినతోడనే
జవము విక్రమంబు చాలగల్గె
ఎఱుఁగమిట్టివాని నీరేడుజగముల
నితనిఁదలప హృదయమెల్లఁ గలఁగు.

శేషు—(ఆశ్చర్యముతో) ఏమీ విపరీతము! (ఆకసమునుజూచి) తుదకితఁడు సూర్యచంద్రుల మ్రింగివేయునాయేమి? ఏమి విచిత్రదృశ్యము! ఔరా! చూచుచుండఁగనే యాతఁడనంతతారామండలము నంటి యగోచరుఁడయినాఁడు—

గీ. పక్షవిక్షేపహతిఁ జేసి పగిలిరాలు
ఖచరులవిమానములు తారకలనుబోలి
వేలుతారలురాలు నీబాలుసురలు
మెచ్చి సుమములఁ బూజింపఁజొచ్చిరనఁగ.

కర్కోటకా! తమ్ముని ప్రభావము జూచితివా? ఇప్పటికి మీయాటలు సాగినను ముందితఁడు మీకు ముప్పుదేకమానఁడు. జరిగినదేదియో జరిగినది. కడచినదానికి వగవఁబనిలేదు. ఇప్పుడైన మీదుర్వృత్తిని మానుఁడు.

కర్కో—అన్నా! మేమెల్లరము నీతిబాహ్యులమనియు ధూర్తులమనియు నమ్మాజన్మాంతము అవ్వాడఁ బ్రతిజ్ఞపట్టితివాయేమి?

శేషు—తమ్ముఁడా! మీకంతదుఃఖమక్కరలేదు. నేనీవరకే నాయుత్తరజీవితపథమేర్పఱచుకొని యున్నాను. నేఁటినుండి మీకలజడిఁ గలిగించుచు నిటనుండను. హిమవత్పర్వతగహ్వరములకుఁ

బోయి తపస్సు చేసికొనుచు కాలము గడపుదును. మీకుపదేశముచే యవలసినది చేసి నావిధ్యుక్తధర్మము నెఱవేర్చితిని. ఆపిదప మీయ దృష్టము.

కర్కో—నీకంత కోపమెందుకు? అంతేకాక సంఘపరిత్యాగ మెందుకు ?

శేషు—పిచ్చివాఁడా. నాకొకవేళ మీ మీఁదఁ గోపమున్న నది నాకేశత్రువు కాని మీకు కాదు. అందుచే నాకోపమునకు మీరు భయపడనక్కఱలేదు. నాకు మీ మీఁదనే కాదు మఱియెవ్వరిమీఁద కూడ నాగ్రహములేదు. నేను తుచ్ఛక్రోధరాక్షసికి బలియగునంతటి మూర్ఖుఁడగాను. ఇంక సంఘపరిత్యాగసమస్యయా ?

గీ. చేయరాని పనులఁ జేసిన భార్యను
విసముకలిసినట్టి యశనమెల్ల
తత్క్షణంబు విడువతగునట్లె ధూర్తుల
సంఘమందునుండఁ జనదుసుమ్ము.

మీరు చేయుదుండగము లంతకంతకు ముదిరిపోవుచున్నవి. బలవంతులమని విఱ్ఱవీగు మీరుచేయని యకృత్యమొక్కటియైన నున్నదా ? కానిమ్ము. సమవర్తియగు జగద్రక్షకుఁడే మిమ్ము దిద్దుకొనుగాక.

కర్కో—అదిగో! నీప్రస్థానమును దెలిసియే కాఁబోలు తమ్ములు నమ్మయు వచ్చుచున్నారు. విన్నట్లును బోసియరులే!

[ప్రవేశము కద్రువ; కొందఱు నాగులును త్వరితముగ]

నాగులు—(తొందరతో) పెద్దన్నా! నీవు తపమునకై కాననములకుఁ బోవుచువట నిజమేనా ? నీకిట్లు చేయఁ జెల్లునా?

కద్రు—శేషూ! తపమునకుఁ బోవ నీకేమి; బలవంతులగు వాసుక్యైరావత తక్షక కర్కోటక ధనంజయ కాళియమణి నాగాదిభు

జంగ రాజసేవితపదారవిందుండవగు, నీవు సర్వపన్నగ ప్రీతికరంబుగ సమస్తసంపదాభిశోభితంబగు నాగలోకాధిపత్యము వహించి పరిపాలింపక వనములఁబడి పోదునందువేమి పాపము. అట్టి పిచ్చిపిచ్చి తలఁపుల మానుము. నామాటవినుము.

శేషు—తల్లీ! సోదరులారా ! నాయీ తుది హితమును వినుఁడు. పిదప దాని మంచిచెడ్డల విమర్శించికొనుఁడు. మీవ్యర్థప్రశ్నల కన్నిటికిని సమాధానము చెప్పుచు నేను కాలయాపనము చేయఁజాలను. చెప్పఁదలఁచిన విషయమును రవ్వంతయుఁ జెప్పి నే వేగఁబోవలయును.

మొన్న మొన్నటి వరకు మీచరిత్రములు పవిత్రములుగ నుండెను. కాని నేఁడు మీరందఱు వచింపరాని పాపజంబాలమును కోరి పూసికొనుచున్నారు. ఇంకను మీరు హృదయపూర్వకముగఁ బ్రయత్నము చేయుచో తరుణోపాయము లేకపోలేదు. మీరుచేయు ఘోరచర్యలలో నిది తలఁపునకుఁ దెచ్చికొన్నప్పుడెల్ల నాహృదయము నీరైపోవుచుండును.

సీ. తల్లివాక్యములని తల్లిచెల్లెలిబెట్టు
హింసయింతేని సహింపఁజాల
న్యాయమిదేయని మోయఁజాలని బర్వుఁ
బినతల్లితలఁ బెట్టఁగనఁగఁజాల
సేవించుటెఱుఁగని చెలువను బాధింప
నించుకంతయును వీక్షింపఁజాల
పాలకులమనుపేరఁ బరిభవించుచువామె
నణచియుంచుట నేను వినఁగఁజాల
మీరుచేయు దౌర్జన్యంబు మితినిమీరి
మీఁదుపాపాంకురంబులు పాదుకొనిమె

కోటికాకులలో నొకకోకిలగతి
నిర్గమింపక మీలోన నిలువఁదరమె ?

గీ. బానిసతనాని కోరులను పాలుపఱచి
పాలకులమన్న గర్వసంభావనమున
నఖిలలోకవిగర్హిత మాచరించి
బానిసలకెల్లఁ బ్రభువులై బ్రదుకుఁడీరు.

గీ. వంశమున కప్రతిష్ఠయే వచ్చునేమొ
లోకమేబెట్టుతిట్టునో నాకలోక
వాసమేమృగ్యమానోయను భయము లేక
వసుధగుండెలఁదీసిన బంటులైరి.

గీ. ఒరులబాధించుటలు మీరలుడుగకున్న
సర్వసౌభ్రాతృప్రేమ మొసంగకున్న
శాంతియుత జీవితంబులు సలుపకున్న
సర్వనాగకులంబు నాశనముధ్రువము.

మీ మీఁద నాకు నాయకత్వమెన్నటికిని వలదు. ఏమా—

గీ. పరివర్తనులకుఁ బ్రభుఁడనై మెలఁగుట
నిరుపయోగమనుట నిశ్చయంబు
కులటయైన సతిని గురుపతివ్రతఁ జేయఁ
జూచునట్టిభర్త సుఖముబోలి.

మీవినాశనము నిక్కువమైనంతవరకు మీబుద్ధులు మార్పుగాంచవు. మీప్రకృతి మారినదా ? మీవంటి సౌభాగ్యశీలురిప్పుడమినుండరు. మీరు నారక్తసంబంధులగుటచే నింత చెప్పవలసి వచ్చినది.

కర్కో—(తనలో) ఏమి ! శేషన్న నేఁడు మాకు శాశ్వతవియోగము ఘటించి పోవుచున్నాఁడా ?

శా. నావాక్యంబులకడ్డుదూరునపు డన్నన్ మిగ్రింగెదేమోయనం జ
గావర్తిల్లితి, నాసఁజేసితి వియోగంబొంద, నాతంపునేఁ
డే వన్యస్థలికో జనందలఁపగా నేమో విచారించెదన్
భావాతీతము లెన్న భ్రాతృప్రణయాస్వాదామృతాహ్లాదముల్.

ఏది యెట్లగునో యట్లు కాకమానదు.

శేషు—నేనిట తడయవలసిన పనిలేదు. నాకు శలవొసఁగుఁడు. తపంబునకుఁ బోవలయు.

(నిర్గమించును.)

అందఱు—(నిరుత్తరులై యధోముఖులైయుందురు.)

(అవనిక జారును.)



శ్రీ

మాతృదాస్యవిమోచనము.

తృతీయాంక

ప్రథమరంగము.

ఒక మఱ్ఱిచెట్టుక్రింద—సాయంతనము.

[వినత వటపత్రములకోయుచు నేరుచునుండును.

వినత—అక్కటా! ఈకద్రువ సన్నిట్టి మాయోపాయ వాగురలఁ గట్టివేయునే? ఈమెహృదయమున నట్టి మాత్సర్యాగ్ని ప్రదీప్తమై యుండెనని యింతకు మున్నెక్కఁడు నెఱుంగనుగదా! విహారమున కని పేరుబెట్టి నన్ను సముద్రతీరమునకుఁ గొనిపోయి యిట్లు మోసము జేయునని కలయందైన తలంచితినా? ఆశ్చర్యము! తెల్లని యశ్వమని పేరుపడిన యుచ్చైశ్శ్రవము వాలము నానాఁడెంత నిపుణతతో నల్లఁగాఁ జేసినది? నాకండ్లతో దాని నానాఁడు పరిశోధించి చూచితిని. మరల నిప్పుడనేకసారులుచూచితినే. ఏదీ యానలుపు? నేనానాఁడు భ్రమపడితిని గాని యానలు పాగంధర్వవాలమునకు రాలేదు. కద్రు

వకీర్తికి వచ్చినది. మిసమిసలాడుచు దృఢవివంచికారజితతంతుల వలెనున్న ఆవాజివాలరోమరాజి యానాఁడెంత చిత్రముగా కృష్ణజలధరసాదృశ్యమున విరాజిల్లెను? ఆనాఁడును పరీక్షాదినముననదియే మో యొక దివ్యశక్తి సమ్మోహనమంత్రమువలె నన్నావహించి కద్రువయాజ్ఞానుసారిణినై చరించునట్లు చేసెను. ఏశక్తిచే నేనట్లు బంధింపఁబడితినో నే నెఱుఁగను గాని మొదటచూచినప్పుడే పరీక్షింపవలసిన యావాలమును మరుచటిదినమువరకు నిలిపివైవ నది కోరినప్పు డాశక్తియే నన్ను వల్లెయనిపించెను. తెల్లఁగ తెల్లవారుట తడవుగ గుఱ్ఱపుతోక నల్లని రూపము దాల్చెను. విధియే ప్రతికూలముగ నున్నాఁడన వలయునుగాని యిందు మానవ ప్రయత్నమున కేమిలోపము కలిగనది? హా! హా! ఏశక్తియో యేమిది? నాజ్యేష్ఠకొమరుని శాపబలము కాదాయది? ఔరా! శపింపఁబడిన నాఁటినుండి యీక్షణము వరకా యుదంతమే విస్మృతిఁబడిన దేమి? ఆవిషయమే జ్ఞాపకమున్న కద్రువపందెమున కంగీకారము చూపెడిదానను కానే! మించిపోయినది. ఇపుడేమి లాభము?........(ఆలోచించి) ట్టుసురుపెట్టి కద్రువమాత్రమేమి పూసుకొన్నది? నేనేదోషమునకు శిక్షింపఁబడితినో తాను నాతప్పునకే శిక్షింపఁబడినది. దైవముసమవర్తికదా! కద్రువపై నాకీర్ష్య కలిగినందులకు నాకు ప్రథమకుమారుఁడరుణునితో వియోగము ప్రాప్తించినది. నామీఁద నసూయాగ్రస్తురాలైనకద్రువయు తనజ్యేష్ఠసుతుఁడు శేషునివలన విశ్లేష దుఃఖమనుభవించినది. ......నాకుస్వేచ్ఛాసౌఖ్యమేనాటికో? ఆహా! ఈశాపవిమోచనము చేయువాఁడు నారెండవ తనయుఁడుగదా! లోకమెంతచిత్రమైనది?

గీ. జననమందినయప్పుడె శాపమిచ్చె
నొకసుతుండుమఱొకఁడు సకలశక్తి

జననికై బలియిడి మోచనము చేయు
పుట్టినదియొక్క యెడనైన పుత్త్రులందు
ఒకరిపోలరు మఱియొక్క రకట! యెందు
అశనివర్షోపలములభ్రి మందునటుల.

సర్వేశ్వరా! ఏమి నీమహిమేము?

మ. సుతనై పుట్టితి పుణ్యమానిజగదీశుండైన దక్షప్రజా
పతికిన్, పట్టితి కశ్యపార్యునిజగత్ప్రఖ్యాతు హస్తాబ్జమున్
సతమున్ బేర్వడినాను సన్మహిళనా, సాగెన్ దినాలవ్వి, నా
సుతునిన్ పీడిచరింతునిప్పుడు యశోశోభావిహీనాత్మనై

నేడీ దుఃఖభారము క్రుంగిపోయినదే కాక కావలసినన్ని యాకులసంపాదింపలేకపోవుటచే నాహృదయము మఱింత వ్యాకులతనులోనైనది. నేడెల్లుచు నాకు మాటలుతప్పవు. అనంతంబగు నీపిపదంబుధి నే నాటికీదవలయునో? (ఎదుటను జూచి) అదిగో! అప్పుడే— మదీయదుఃఖానలోద్గత ధూమశిఖల వడువున నిగులు బ్రహ్మాండభాండమంతట నాక్రమించుకొని క్రమక్రమముగా మన్ను మిన్ను నేకము సేయుచున్నవి?

గీ. ఇనుఁడు బలహీనుఁడగుట యామిని గ్రహించి
ప్రబలి, శత్రులరక్తస్రవంతులందుఁ
దేల్చి, రాజ్యము నవలీల గెల్చి యేలు
నబలయేయయ్యు నెంత నిరంకుశముగ

సీ. పర్వతంబైనను పరమాణువైనను
భేదంబు దోఁపని విధము సేయు,
సత్పథంబైనను చనరానిపథమైన
సమతనొప్పారఁగ సంతరించు,
నెఱికంబులును మిట్టు లొక్కరీతిగ దృష్టి

గోచరంబగునట్లు లాచరించు,
రజ్జుసర్పంబుల భ్రాంతి మైనొకలాగు
కనుపడునట్టుల కన్నుఁ బ్రామ్ము,

గీ. కనులుగల్గినలాభంబు నణచివేయు,
భీతిహృదయంబులందున విస్తరింపఁ
జేయుఁ దనపాలనంబున స్థిరమునమున
క్రిందుమీఁదెఱుంగనిచేత, కేనెలంత.

ఇటనిఁక దడవు నుసలక వేగ కద్రువకొలువునకుఁ బోవలయును.

(పర్ణంబులమాటగట్టుకొని నిష్క్రమించును.)

తెరపడును.

ద్వితీయరంగము.

దేవలోకము — సాయంతనము.

[అగ్నిదేవుఁడాసీనుఁడైయుండును. దేవతలు, ఋషులు, కలవిల పడుచు ప్రవేశించి మ్రొక్కుదురు. అగ్నిదేవుఁడాశ్చర్యము నభినయించును.]

దేవతలు, ఋషులు — దేవా! అగ్నిదేవా!

పాట.

రక్షింపుము! రక్షింపుము! లోకరక్షకా!
జ్వాలనదేవా! జాతవేదా! వైశ్వానర! వాయుసఖా! ॥రక్షిం॥
౧. బడబానల జ్వాలలగతిఁ బరతెంచుచు వ్యాప్తిఁ గనక
సురమునిజనస్తుత్యవినుత! శోభితనీరంధ్రకీర్తి.....॥రక్షిం॥

౨. కోపించుటనీకుఁదగునె లోపమునీకేమికలిగె
ఉరుతరగంభీర తేజముడిపి శాంతిపొందిమమ్ము? ...... ॥రక్షిం॥

అగ్ని.—దేవతలారా! భయపడకుఁడు. భయపడకుఁడు. ఇది నావ్యాప్తివలనఁగలిగినది కాదు. కశ్యపపుత్రుండగు గరుత్మంతుఁడిప్పుడే జన్మించి నభంబునకెగిరినాఁడు. వాని తేజోరాశిఁజూచి మీరిట్టిభ్రమకు లోనైతిరి. వైనతేయుఁడు మహాబలవంతుఁడు, మహోదారుఁడు, దేవహితానురక్తుఁడు, దైత్యనాగవిరోధి. ఆతఁడు తేజంబున నాతోసాటివచ్చువాఁడు. అదిగదిగో! ఆతఁడిట్లే తెంచుచున్నాఁడు. మీరెల్లరిటకు రండు. మనమందఱమును వానినిఁ దన తేజము నుడిపికొనునట్లు ప్రార్థింపవలయును.

దేవత, ఋషు — అంతకన్న కావలసిన దేమున్నది? అట్లేచేయుదము.

[ప్రవేశము: గరుడుఁడు నభోమార్గమున.]

దేవతలు, ఋషులు — (నమస్కరించుచు) గరుడదేవా! నీకునమస్కారములు

పంచచామరము.

దురంతబాధలోకమెల్ల దుర్గతిన్ మునుంగుచున్
నిరంతరంబు బాధఁజెందు నీదు తేజమందు, నా
కొరంతఁదీర్పనీదుదీప్తి కొంతమాటుసేయవే?
పరంతపా! ప్రజాశుభావిభావరీప్రభాకరా

నీవువిప్రుండవు. ప్రభారాశివి. మహాకీర్తివి. జగమునెడదయఁజూపి నీ తేజమునడఁచుకొనుము. శుభప్రదుండవగుము. మమ్మనుగ్రహింపుము.

[గరుడుఁడు తేజమునుపసంహరించుకొని చిన్నపక్షివలెఁగాన్పించును.]

దేవ, ఋషి — ధన్యోస్మి. ధన్యోస్మి. నీతేజముడిపికొని మమ్మందఱ రక్షించితివి. ఇవిగో మాకృతజ్ఞతానతులఁగైకొనుము.

[గరుడుఁడు నిర్గమించును.]

అగ్ని— దేవఋషిప్రముఖులారా! గరుడుఁడు మనల ననుగ్రహించియరిగినాఁడు. మనకింక భయము లేదు. రండు పోదము.

[అందఱు నిష్క్రమింతురు.]

తృతీయరంగము.

రమణవద్వీపమందలియుద్యానవనము—సాయంతనము.

[వినత; గరుత్మంతుఁడు ఒక లతామంటపముదరి నిలుచుండి ప్రసంగించుచుందురు.]

గరు—అమ్మా! కాద్రవేయులందఱు తల్లినిమించి యొకయాకు నెక్కువచదివినట్లు గన్పించుచున్నారుసుమా! నిన్ను నన్ను నెందులకమ్మా యీమూర్ఖులు బాధపెట్టెదరు?

విన—(స్వగ) వీనికిపుడేమని చెప్పఁగలను? (ప్రకా) నాయనా! వారివలన నీవెంత బాధపడుచుంటివో యితండ్రీ!

గరు—అమ్మా! నాకీబాహ్యశరీరబాధ యొకలెక్కలోనిది కాదు గాని కద్రూదేవి యామెసంతతి నిత్యమాడు కర్ణకఠోరవాక్యములకు నాహృదయము కుమిలిపోవుచున్నది. వీరందఱింత యధర్మముగా చరించుచున్నను మనమేమియుననక యేల వారియడుగులకు మడుగులొగ్గవలయునమ్మా?

మ. నెరపన్వచ్చు ప్రశస్త్వమెంతయినఁగానీ, స్వార్థచింతాత్ములై
తరవారిన్కరపాదముల్నఱుక చింతన్బొందనేగాని, యా

తరుణీవాక్యము లాత్మఁగ్రుచ్చి కడు బాధఁబెట్టుచున్నవిప్పుడున్
తరణోపాయము లేదె దీనికి వెతన్ దాటంగ నేనాటికిన్?

ఉ. ఈవును నేను నాగులనహీనరయంబున దెచ్చినార మీ
దీవికిఁగాని, యామె నను దీవ్రముగా మది నువ్వనాడె నే
త్రోవను సర్పసంతతినిఁ ద్రోసితిఁ గ్రిందికిఁ గంచు, నయ్యయో!
వేవురి నేని యోర్వఁగల వీరునకా భువి దాస్యశృంఖలల్ ?.

ఈదినమంతయు వారికి సేవఁ జేయుటతోడ నేసరిపోయినది. ఇంక విశ్రాంతి యెక్కడిది ? ...హృదయము వ్యాకులమొందని ఘడియ లేదు. నీవు చెప్పితివని యింత కాలమువరకు వీరి ఘోరచర్యలనెల్ల నోర్చియున్నాను. ఇఁక నోర్వఁగలుగుదునో లేనో చెప్పఁజాలను. అమ్మా! నే నడిగినదానికి ప్రత్యుత్తరమునీయక విచారవిహ్వలహృదయవై యూరకుంటివేమి ?

గీ కద్రుసుతులకిట్టి గర్వము దేలకో ?
మనల బాధపెట్టు మనసదేమొ ?
వ్యథలఁబడియుఁ గూడ వాయెత్త రాదంట
మనయవస్థలిట్లు మారుటేల ?

విన—తండ్రీ ! నావలనఁగాకున్న నీకీదుర్గతి కలుగకుండనే యుండెడిదిగదా !

గరు—(ఆశ్చర్యముతో) అమ్మా ! దీనికంతకు నీవెట్లు కారకురాలవగుదువు ? మనకీదాస్యము నీవలన నేకలిగినదా ?

విన—గరుడా ! కద్రువయు నామెసంతతియు నీసమీపమునందే విహరించుచుండుట మన మాటల వినఁగలరు. ఇటుగమ్ము చెప్పెదను

(ఏమో చెవులో చెప్పును. ఇది పూర్వచ[illegible]ము)

గరు—(క్రోధోద్రేకముచే తిచ్చపడి) ఆఁ ! —ఆఁ ! —

విన—నాయనా ! కద్రువ నన్ను దాస్యమునకు లోఁ జేయక పూర్వమును చేసినపిడసనుకూడ నన్నుఁ బెట్టినహింస నేమని చెప్పను?

సీ. సుతుప[illegible]గాగ్నిచే శోకించుచున్నని
స్పర్ధవీడక నన్ను పరిభవించె
ఉచ్చైశ్శ్రవముఁగాంచి యుండినమురునాఁడు
సత్యతవీడి మోసంబుఁ జేసె
సాధారణులు చేయఁజాలని పనులకు
నన్నె నియోగించి నవయఁ జేయు
దేనికైననుగాని మానక యాపరాధ
యనిన నన్నె నోర్వఁగ నాడిపోయు
గీ. ఉల్లమున మచ్చరంబెంతొ యున్నయదియొ
అదిమహోరాజ్ఞియైనట్టు, లక్కటకట!
నేను నీచాతినీచనై నిగుడునటుల
మెలఁగుచుండుచు కద్రువ మిత్తివోలె!

చ. వరములనిచ్చి నాథుఁడు శుభంకరుఁడై మముఁబ్రోచి కాననాం
తరములకున్ జనంగ, బలదర్పయుతుండు సుతుండు కల్గియున్
సరగున నన్ను వీడఁ, దనజాలములోఁ బడఁద్రోసియు కద్రువ, నే
కరము దురంతదుఃఖమును గాంచెద కంపలపడ్డ కాకినై.

గరు—(కోపముతో) ఆఁ ! ఎంత పనిచేసిరి. ?

గీ. పాపభుజగాటవీ దావపావకుండు
గరుడుఁ డున్నాఁడు వారలఁగాల్చివేయ
ఇంక వారలదౌష్ట్యంబు లేమిసాగు
అడలకిఁక వారి కొందు చెండాడుదమ్మ!
గీ. ఆనతిచ్చిన మాత్రాన నఖిలలోక
ములను భస్మముఁ జేయఁగాఁ గలుగునట్టి

తనయుఁడున్నాఁడు నీవేలతల్లడిల్ల
ఆనతీవమ్మ వారలననతునమ్మ

ఇప్పుడేపోయి యాపాపజాతిని కూకటివ్రేళ్ళతోఁ గూల్చివైచి వచ్చెదను. (హుంకరించిపోవుచు.)

విన—(అడ్డుగావచ్చిపట్టుకొని) వలదు. వలదు. నాయనా! నామాటవినవా ? అంతవేగిరపడకుము. శాంతియుతమార్గంబే యుక్తమంబుగాని తద్విరోధమార్గంబింక పనికిరాదు. మన మాత్మబలమును సాధనముగాఁజేసికొని మనస్వాతంత్ర్యమును గ్రహింపవలయునేగాని కేవలము నింద్యమగు పశుబలమును నీసోదరులపైనను పెద్దతల్లిపైనను ప్రయోగింతుననుట మఁ పుణ్యభారతావనికి, ఋషిసంతతికి, నీకొలమునకును తీరని కళంకముగాదా ? "అహింసా పరమోధర్మ" యని ఘోషించు వేదవాక్యమును మనము మన్నింపకపోయినప్పుడు వేదమతమువారమని చెప్పుకొనుటకు మనకర్హత కలదా ? ఇదియేమి ధర్మానుగతుఁడైనరాజు రాజనీతిననుసరించి పరరాజ్యాక్రమణము సేయుటవంటిదనుకొంటివా ? లేక స్వరాష్ట్ర రక్షణోద్యోగము సేయుటయని భ్రాంతిఁజెందితివా ? ఏమని నీభ్రాతృజనుల రక్తధారలఁ గండ్లఁ జూడఁదలంచెదవు ? హా ! హా ! పశుబల మెంతనీచాతినీచమైనది ? ఘోరమైనది ? తండ్రీ! బ్రతికియుండిన బలుసాకుఁ దినవచ్చునుగాని స్వజనరక్తమాంస సంకలితాన్నము నేను భుజింపలేనోయి ! ప్రథమకుమారఘాతకినిఁజేసిన యీర్ష్యాపిశాచమునకు లోఁబడినదిచాలక నికృష్టదాస్యపాశముల బంధించిరని సోదరిని దానిబిడ్డలను వినాశనముచేయ నుత్సహించు క్రోధరాక్షసికిఁగూడ లోనుకావలయునా ? సమయభ్యుదయమునకై మనమాచరించుకార్యములు పరులకు విపత్కరములుగ నుండఁదగునా ? ఏదైనయెడరు తొడరినప్పుడేగదా నిదానించి ధైర్యమువహించి కర్తవ్యనిశ్చయము చేసికొనవల్లయును! అట్టియనమున

నీవింత వేగిరపడుటనింద్యముకాదా? నీవంతకోపముచూపెదవెందులకు? కోపము నీకు బలమునిచ్చుననుకొనుచుంటివా? ఐశ్వర్యమునొసఁగునా? ఆగ్రహము జంపుకొనినవాఁడే కాని యితరుఁడు శక్తిమంతుఁడుకాఁడు. ఇట్టి యుత్తమశక్తిని హస్తగతముగావించుకొని మహోదారభావసంకలితుఁడగునతఁడే ఘనకార్యనిర్వహణదక్షుఁడు. దుర్మార్గుఁడయ్యెనొకానొకఁడు మహాకార్యమును సాధించెనందువా యది చిరకాలము నిలుచుట దుర్లభము. కుమారా! శాంతచిత్తమున దాస్యవిమోచన సాధన మరయుము.

గరు—(శాంతించి) అమ్మా! కోపోద్రేకమున నట్లంటిని; క్షమింపుము. నాహృదయ మాగ్రహోద్వేగముచే కలకబాఱినందున నా సాధనమెట్లో యోజింపలేకున్నాను. దానిని నీవెఱుఁగుదువా ?

విన—నాకేమి తెలియును. అయినను దీనివిషయమై మనము తలఁచింపుకొననక్కఱలేదు. వారినడిగియే మనసంశయము దీర్చుకొనవచ్చును. వారు మనల దాస్యమునుండి విడిచిపుచ్చుట కేమికోరుదురో—

గరు—(అర్థోక్తిలో) దానిని విశ్వప్రయత్నముచేసి ప్రాణములైననవీడి నెఱవేర్చుటకు సంసిద్ధుఁడనై యున్నాను.

విన—కుమారా! ఇంతదనుక నీయగ్రజువాక్యానుసారముగ నీవు నాదాస్యవిమోచనము చేయుదువని సజీవినైయుంటినేగాని లేకున్ననీపాటికే వినత పరలోకమునకు పాత్రకాపై యుండవలసినదేసుమీ! శక్తిమంతులుదయించినపిదప వారు తల్లిదండ్రుల నిడుమలఁ గుడువనీయరుగదా? ఏనాటికీ విపత్పయోధరములనుండి స్వాతంత్ర్యచంద్రుఁడు వెలువడి యానందకౌముదీలహరి నోలలాడించునో ? (విచారించును)

గరు—అమ్మా! ఊరడిల్లు మూరడిల్లుము. నీచింత నేటితో

దీరఁగలదు. వారికోరికఁదీర్చిన మన యభిమతమును దీరునుగదా! వారి నీవిషయ మడిగిచూతును పిదప వారిభావము నెఱిఁగి మనము సమయానుకూలముగ మెలఁగవచ్చును. అమ్మా! అదిగో కద్రువయు నామె తనయులు నిచ్చటికి వచ్చుచున్నారు. నీకంటినీరును తుడుచుకొనుము.

(ప్రవేశ: కద్రువ; కొందఱునాగులు.)

కద్రు—వినతా! ఇదియేమివిపరీతమే? నీవును నీకొమరుఁడు నిచ్చట హాయిగాఁగూరుచున్న మాపనులన్నియుఁ దీరుననుకొంటివా? ఈఫలపుష్పోద్యానమున మీకెంతపనియున్నది? తిని కూరుచుండుటలంపేకాని యజమాను లేమియాజ్ఞాపింతురో యనుమాటయే లేదు. ఔరా! ఎంతయాగడమైపోయెను!

విన—పనియంతయుఁ దీరినవెనుక నింక చేయవలసినదేమున్నది? ఇంతదనుక మీకార్యములే చేసిచేసి యలసియున్న మాకీవ్వంత విశ్రాంతి లేకున్ననెట్లు? అంతేకాక యాపిదప మీరు పని చెప్పనే లేదు గదా!

కద్రు—ఆఁ! ఆఁ! క్షమి మామాటల కప్పుడే యెదురు పలుకుచున్నావా? ఈ పిశాచకుమారునిఁ గనుకొని యేమి పొంగిపోవుచున్నావే? మేము నీకు పనిఁ జెప్పకున్న నింక నేమి చేయవలయునని యడిగి చేయుచుండవలయును గాని యిట్లుస్వాములై యుద్యానవనవిహారములఁ జిత్తగించుచు నొకరిచెవులొకరు కొఱికికొనుచు నిదియేమని మేమడుగఁదలంప మాదవుడలు దగ్గఱగా నెక్కెదరా? మావలన నెన్నెన్ని సౌఖ్యములందుచున్నను విశ్వాసముచూపక పోవుటయేగాక మేము మీవద్దకు వచ్చినప్పుడైన లేచినిలువఁబడి మర్యాదచూపకున్నారు! ఏమి పొగరెక్కినది?

నాగు—గరుడా! మమ్మునీఱెక్కలపైఁ గూరుచుండఁబెట్టుకొని చీఁకటిపడులోపల నీజంబూద్వీపము నొక్కసారి చుట్టిరమ్ము. రమ్ము.

ఇంకను జాగుసేయుదువేమి? (గరుడుని చేయిపట్టుకొని లాగెదరు.)

గరు—(చేయివదలించుకొని కోపముతో) నోరుమూసికొని యూరకొనుఁడు. కద్రూ! మేమేల—

కద్రు—(అర్ధోక్తిలో) ఆ! దుర్మార్గుఁడా! ఏమిచేతలు! ఏమిపిలుపులురా అవి? నీకు మేమెవ్వరమో తెలియదా?

గరు—మీప్రశ్నలకు ప్రత్యుత్తరములురావు. ఇప్పుడు నేనడుగఁబోవువానికి సరియగు ప్రత్యుత్తరములనిండు.

విన—(కద్రువతో) అమ్మా! పసివాఁడగు గరుడుని మాటలు పాటిసేయకుము!

కద్రు—నీసిగ్గు చిమిడిరితే! నీవునుతగవుదిద్దుటయేమే?

నాగు—గరుడా! నీప్రశ్నలకేమిగాని మనవిహారమునకు వేళమించుచున్నదిరా!

గరు—(తీవ్రముగ) కద్రూ! ఏమనెదవు?

నాగు—(ఒకరితో నొకరు) ఈతనివరుస బాగులేదు. మనము మాటాడవలదు. ఈతనికింత కోపమున్నదని మున్నెన్నఁడెఱుఁగము.

కద్రు—అడుగుము. నేనేమి చెప్పనంటినా?

విన—(తనలో) చెప్పకేమిచేయుదువు?

గరు—మేమెంతకాలము మీదాస్యము చేయవలయును?

కద్రు—మీజీవితాంతమువరకును.

గరు—అంతవరకు మాకీదాస్యముతప్పదా?

కద్రు—ఒక్కనాటికితప్పదు.

విన—ఒకవేళ మాదాస్యవిమోచనము చేయుమని మిమ్ముకోరి మీ—

కద్రు—మాపాదములు పట్టినను మీకదితప్పదు. తప్పదు.

గరు—పూర్ణముగా వినవేమి ?

కద్రు—వినుచునేయున్నాను. ఇంకను వినఁగలను.

విన—మీరు కోరినదేదియైన నాకుమారుఁడు తీర్చును. మా దాస్యవిమోచనమును చేయుఁడు.

కద్రు—మాకేమి కావలసినదానిని నీవు తేఁగలవా గరుడా?

గరు—ఆఁ. తెచ్చెదను.

కద్రు—అయిన నావిషయము యోజించి చెప్పెద నుండుము.

విన—(స్వగ) ఏమి అసాధ్యపుకోరికఁ గోరునోగదా !

నాగు—అమ్మా ! ఏమియాలోచించితివావు ?

కద్రు—ఏమియులోచించుటలేను. వానిని తెమ్మనుటకు మఱు లేనివేవి ?

నాగు—మాకు చిరకాలమునుండి యమృతమును త్రాగవలయునని యున్నది. గరుడు నమృతమును దెమ్మనుము.

కద్రు—తేగలఁడా ?

నాగు—సంశయింపకుము. దానివలన లాభములు చాలగలవు.

కద్రు—ఏమవి ?

నాగు—ఇప్పుడు కాదు. ఇంటికి వెడలినపిదప చెప్పుకొందము.

కద్రు—నాకును సుధను త్రాగవలయుననియేయున్నది. (ప్రకా) గరుడా! నీవు జవసత్వముల ననమానుఁడవు. నిన్నల్పకార్యములకు నియోగించి నిన్ను కొంచపఱచఁజాలము. అంతేకాక నీబలపరాక్రమముల పరీక్షింపవలెనని మాకొక గొప్పయభిలాషముకలదు, సరే! దానికి తగినసమయము వచ్చినది. మీకు నిజముగ స్వాతంత్ర్యముపొందుదమనియే యుండిన అమృతమును—వినుచున్నావా ? అమృతమును తెచ్చి మాకిచ్చిన మీకు సంపూర్ణస్వాతంత్ర్యమును మేమిచ్చెదము.

గరు—అమృతమునిచ్చిన మమ్ము విడుతురా?

కద్రు—తప్పక విడుతుము. ఆడితప్పుదుమా.

విన—(తనలో) గరుడుఁ డమృతమును తేఁగలఁడా? నిర్జరుల గెలువఁగలఁడా? ఆ! గెలువలేకేమి? వీనికంత శక్తిలేకున్నను అరుణుని వాక్యానుసారము వీఁడు జయింపఁగలఁడుగదా!

గరు—సరియే నేఁడే నేనమృతార్థమై పోయెద. మీరలుండుఁడు.

నాగు—(ఆనందముతో) గరుడా! అమృతమే తెచ్చెదవా ? నీ వమృతమునకుఁ బోవునప్పుడు మమ్ముకూడ స్వర్గలోకమునకుఁ గొనిపోయి త్రిప్పితీసికొనిరమ్ము. ఈదినమున మమ్ము మోయనక్కఱలేదులే.

గరు—ఒకమారు కొనిపోయి మరల తెచ్చుట నాయభిమతము గాదు. మీకు శాశ్వతస్వర్గలోకవాసానందమును కూర్ప నే నభిలషింతును.

కద్రు—(తనలో) గరుడుఁ డెంతనిర్భయముగా మాటలాడును. కానీ! వీనికి ముసుళ్ళపండుగ ముందున్నది. (ప్రకా) తనయులారా ! మనము పోదము రండు.

నాగు—(వారిలో) ఈతఁడు పూర్వపు గరుడుఁడు కాడు,

[కద్రువ, నాగులు నిర్గమింతురు.]

గరు—అమ్మా! నన్ను దీవించి పంపుము. అసురులనిగ్రహింపఁ దగినబలము చేకూరుటకు నాకాహారమేమి చూపెదవు?

విన—తండ్రీ! సముద్రగర్భంబున నొకదీవియం దసంఖ్యాతీతులగు నిషాదులు నివసించుచు శత్రువులకుఁ జిక్కక లోకకంటకులై ప్రవర్తించుచున్నారు. అందు బ్రాహ్మణులఁ బరిహరించి తక్కుంగలవారి నెల్లఁ దినుము. నవగ్రహములు, అష్టదిక్పాలకులు, త్రిమూర్తులు నిన్ను రక్షింతురుగాక! నీకు బలము జవము కలుగుఁగాక! శత్రువుల కజేయుండవై సుధను దెత్తువుగాత !

గరు—నీయాశీర్వచనము ఫలించుగాక. అమ్మా! బ్రాహ్మణు లెట్లుందురో యా బ్రాహ్మణు లెట్లుందురో నాకు తెలియదు. బ్రాహ్మణుఁడన అగ్నిహోత్రునివలె తీవ్రమైయుండునా! లేక జాబిల్లివలె చల్లఁగా నుండునా?

విన—(నవ్వి) గరుడా! దానినిఁ జెప్పెద శ్రద్ధతో వినుము.

సీ. తనజీవితంబు నితరులకై వెచ్చించి
పరహితంబును గోరు బ్రాహ్మణుండు
వేదాధ్యయనమందు వెచ్చించుచుండి హా
రాత్రముల్ గడపును బ్రాహ్మణుండు,
అనవసరంబుగ నభిమాన మొందఁడు,
ప్రాజ్ఞుఁడై మనుచుండు బ్రాహ్మణుండు,
ఎఱుఁగఁడింతయుకోప, మింద్రియజేతయై
వర్తిల్లు, నిజమూడు, బ్రాహ్మణుండు,
బ్రహ్మతేజంబు ముఖమున భాసమాన
మగుచునుండును బ్రాహ్మణుఁడైనవాని
కద్దిగ్రహియించి నీవు ధరామరులను
బరిహరించియితరుల నెల్లఁ బట్టితినుము.

గీ. ధర్మరతిఁ గల్గి వర్తించు ధరణిసురుల
పట్టివధియింతురా ధూర్తవంచకాళు
కాకిరాతులు, వారలనారగించు
తృప్తిమాపుణ్యానందపు సుతుఁడ నీకు

విప్రరుగప్పిన నిప్పులవలెనుండు కొందఱు మహనీయులగు ధరణీపుంగల నెఱుంగువిధమును చెప్పెదను వినుము. నీవాకిరాతులఁ దినునప్పుడు—

గీ. మ్రింగినంతనె గాలమురీతి నెవరు
కంఠమున గాలమువలె కదలకుండి

వీరి జఠరాగ్నిని గతి బాధపెట్టువారో
వారలే విప్రవరులు పరిభావయుతులు.

బ్రహ్మజ్ఞానసంపన్నులే బ్రాహ్మణులు. వారికివారిహారాదులుకూడ కింకరులై జోహారుసేయుదురు. వారు తృణమును మేరువును మేరువును తృణమును సేయసమర్థులు. వారికి నీవెగ్గుసేయకుము. కృపాళువులగువారు నీకు శ్రేయముఁ గూర్తురు!

గరు—అమ్మా! నీసదుపదేశము నాకు మహోపకారమైనది. బ్రాహ్మణాబ్రాహ్మణ విచక్షణపరిజ్ఞానుఁడనై నేను ధన్యుండనైతిని. ఇఁక నేనమరలోకమునకుఁ బోవుదునా?

విన—అట్లే పోయిరమ్ము. కుమారా! నీవు చిరంజీవివగుదువుగాక! నిన్ను—

క. అనిలుండు పక్షయుగ్మము
ననలుఁడు నీశిరము నమృతాంశుఁడు వీపున్
ఇనుఁడు శరీరంబును
ఘనమగు కృపతోడ నెపుడు గాతురుగాకన్.

కుమారా! జయశీలుండవై యశస్సముపార్జితుండవై నాకనులు చల్లఁగ దిరిగిరమ్ము పొమ్ము.

గరు—అమ్మా! నమస్కారము పోయివచ్చెద. (ప్రస్థానము)

విన—తేపటితో నాహృదయకంటక మూడఁగలదు. నాసుతునకు జయము తప్పదు, తప్పదు.

(తెరలో)

కర్కోటకుఁడు—తప్పదు. తప్పదు. గరుడుఁడమృతార్థమైపోయినంతమాత్రమున వినత నేయవలసినదాస్యము తప్పునా యేమి? దాసీ! వినతా

విన― (గడగడ వణఁకి తనలో) కర్కోటకుఁడు కాఁబోలు నెవ్వరి తోడనో నావిషయము పలుకుచు నన్ను బాధించుటకిటకువచ్చుచున్నాఁడు. నేఁడేమో మూఁడఁగనున్నది. (ప్రకా) ఏమయ్యా !

[ప్రవేశ: కర్కోటకుఁడు కోపముతో]

కర్కో― ఓసీ ! వినతా ! అవినీతా ! నీకెంత మొండిబ్రతుకే? ఇంకను నిచ్చట గోళ్ళు గిల్లుకొనుచుఁ గూరుచున్నావా ? పద పద కూఁ ? ఇంకను నడువవేమి ? కేశాకర్షణంబును― పాదప్రహారణంబులును గావలయునా యేమి ? పిశాచీ ! రాక్షసీ ! పాతకీ !

విన― (నడచుచు) హా ! దైవమా ! హతవిధీ !!

కర్కో― పద పద. నిన్ను చీల్చి ముక్కలుసేసి మ్రింగినప్పుడుగాని నీపొగరణఁగదు. త్వరగా నడువవేమి ? (కొట్టఁబోవును.)

(తెఱపడును.)

చతుర్థరంగము.

గంధమాదన పర్వతముమీఁద― ప్రభాతము.

[కశ్యపప్రజాపతి తపోదీక్షనుండును.]

[ప్రవేశ. గరుడుఁడు పాదచారియై]

గరు― తండ్రీ ! నమస్కారము.

కశ్య― (కనులు తెఱచిచూచి) కుమారా ! నీవా ? చిరంజీవివగుము. ఏమిపనివడి యిటకు వచ్చినావు ?

గరు― జనకా ! తమరెఱుంగనిదేమికలదు. అమ్మదాస్యవిమోచనంబునకై యమృతము నమరులఁజయించి తేఁబోవుచున్నాను. అమ్మ నిషాదులఁజంపి యాఁకలి దీర్చుకొనుమన్నదని కోట్లకొలఁది కిరాతులభ

క్షించితిని. కానియాఁకలి యావంతయుఁబోలేదు. తమ్మునాకుఁదగిన యాహారమిప్పింపఁ బ్రార్థించుచున్నాను.

కశ్య― గరుడా ! నీజన్మపవిత్రమైనది. నిన్ను గాంచి నేను ధన్యుఁడనైతిని. నీప్రయత్నము ప్రశంసాపాత్రమైనది. ఇటువినుము. పూర్వమిరువురు సోదరులు ధనలోభమున నన్యోన్య శాపంబులనిడుకొని యిప్పుడు భూరికాయులైన గజకూర్మంబులై లంబతీర్థ కాంతారప్రాంతస్థిత సరోవరంబునఁ బూర్వవైరంబునఁ జేసి యొకరితో నొకరు నిరంతరము పోరుకొనుచుందురు. వారినిరువురఁ దిని నీయాఁకలి యణఁగఁగలదు. పొమ్ము నీకు కార్యసిద్ధియగుఁగాక !

గరు― మహాప్రసాదము. [ప్రస్థానము.]

కశ్య― "అల్పవిద్యో మహాగర్వః" యనునట్లు తాను చేసినయల్ప తపంబుచే క్రిందుమీఁదెఱుఁగక సంచరించి తనచేతలవలన మహదున్నతస్థితినందనీకద్రువ విశ్వప్రయత్నముగావించినది. కాని "అన్యథాచింతితం కార్యం దైవమన్యత్ర చింతయేత్" అనునట్లు దానిచర్యలు దానికే విషమించినవి.

సీ. ఘనవరంబులఁ బొందెనని వినతాసతి
బాధించినట్టియా పాపఫలము,
పుత్రునిఁ గోల్పోయి పురపురఁ బొక్కెడు
అనుజ నిరతము సేయుహాస్యఫలము,
తనయునిఁబంపి గంధర్వవాలమునల్ప
సలిపినయట్టి మోసంపుఫలము,
గరుడుని చావును గాంక్షించి సల్పెడు
అతిఘోరనీచ కార్యాళిఫలము,

అప్పుడే శేషుని వియోగమనుచు నొకటి
సర్పములఁజావుమనినట్టి శాపమొకటి
యైఫలించెను, ముందేమియగునొ కద్రు
తెచ్చుకొన్నావుపన్ గట్టనుచ్చులీవె!

[గరుడుఁడు నభోమార్గమున, ముక్కుతో వాలఖిల్యఋషులు వ్రేలాడుచున్న మఱ్ఱికొమ్మఁ గఱచికొని యొకకాలి వ్రేళ్ళతో గజమును రెండవకాలి వ్రేళ్ళతో నొకకూర్మమును బట్టుకొని నిలువఁబడును. గరుత్మంతుని గమన వేగముచే లోపల పెద్ద కలకల మగును]

కశ్య—(గరుడునిచూచి) అదేమి ? అదేమి ? గరుడా ! ఆఁ ! తెలిసినది. అట్లేయుండుము. మాటాడకుము. మాటాడకుము. లంబతీర్థసరోవరములోని గజకూర్మంబులగు వీని నామఱ్ఱిచెట్టుపై పెట్టుకొని తినుచుండ నది విరిగిపోయినదా ? ఓహో ! దీనిని వాలఖిల్యమహర్షివతంసములున్నారా ? ఆహా ! అందువలననా యీకొమ్మనుకూడ భారమనక ముక్కుతోఁగఱచికొని వచ్చినావు ! అయ్యో ! తుదకీ వాలఖిల్య మహర్షులకు శ్రమగలిగింపవలసి వచ్చెనా ? ఎంత యపచారము కలిగినది ! కానిమ్ము. విధివిధానమునకు నీవేమిచేయఁగలవు. ఇందు నీ దోసము లేశమును లేదు. నీయహింసాపరాయణత్వము నీసాహసౌదార్యములు నీధర్మవర్తనము లాచంద్రార్కము చెప్పుకొనఁబడుగాక! (వాలఖిల్యులతో) ఓమునినాథులారా ! ఈవైనతేయుఁడు భువనహితమహారంభుఁడు. బలసమన్వితుఁడు. మీకు బాధయగునని యీతరుశాఖను విడువనేరకున్నాఁడు. అజ్ఞానకృతమగు వీని యపరాధమును క్షమించి యీకొమ్మను విడిచిచని వీనికి శుభప్రదులగుఁడు.

(వాలఖిల్యఋషులు నిర్గమింతురు.)

కశ్య—నాయనా ! వాలఖిల్యులు మనలఁ గటాక్షించి యరిగినారు. . . . ఆఁ! నీయభిమత మేమో నేనుదివ్యదృష్టిని గ్రహించితిని. ఈమ

హాశాఖను హిమశైలకందరభాగమున విడువుము. అదినిర్మానుష్యమై యీశ్వరునికేని యగమ్యముగానుండును. దీనినక్కడ విడుచుటచే లక్షలకొలఁది మనుష్యుల చంపిన పాపమునుండి నీవు విముక్తుఁడవగుదువు. ఆహిమాలయపర్వతము లిచ్చటకు లక్షయోజనంబుల దూరమునను న్నవి. ఈగజకచ్ఛపముల నచ్చటి మహాద్రిపైఁదిని యాపిదప నమృతమును దేబొమ్ము. నీకు జయముతప్పక కలుగును. శుభమగుపొమ్ము.

గరు—(నభోమార్గమున నిర్గమించును.) 1230

కశ్య—(గరుడుఁడు కనిపించినంతవఱకు వానివంకఁజూచి) నేటికి వైనతేయుని వలన తనయులులేని కొఱఁతపూర్తిగ దీరినది.(గరుడుఁడు పోయిన త్రోవనే చూచుచుండును.)

(తెరవ్రాలును)

శ్రీ

మాతృదాస్యవిమోచనము.

చతుర్థాంకము.

ప్రథమరంగము.

ఇంద్రలోకము—మధ్యాహ్నము.

[తెరలో కలకలము]

దేవేంద్రుఁడు; బృహస్పతి కలవిలపడుచు ప్రవేశింతురు.]

ఇంద్రు—దేవగురూ! ఇదియేమి ప్రళయము సంఘటిల్లినది? అయ్యో!

చ. పిడుగులు రాలఁగాఁ దొడఁగె, భీతిలె సర్వసుపర్వకోటి, పెన్
దడయుదయించె నాహృదయతామరసంబున, నస్త్రశస్త్రముల్
బడెడు తమంతఁదాము, బలవంతముగా నసుపుంజమున్ బడున్,!
కడువడఁ గంగఁ జొచ్చిరి యఖండప్రభావులు సూర్యచంద్రులున్

గీ. త్రిదశవిధ్వంసకుండు రాత్రించరుండె
యెందు మనలను పోరఁగా వచ్చువాఁడొ?
దేవరాజన్న పేరునఁ దేజరిలుదుఁ
గాని, నాకుసుఖంబు గగనసుమము!

సురాచార్యా! నీయభిప్రాయ మేమి?

బృహ—మహేంద్రా! ఇదియంతయు గరుత్మంతుని ప్రభావము కాని యన్యము కాదు.

ఇంద్రు—(తొందరతో) గరుత్మంతుఁడా! ఆయనామకవ్యక్తి యెవ్వఁడు?

బృహ—సురరాజా! దానిప్రభావ మింతలోనే నీకుఁ దెలియఁగలదు.

ఇంద్రు—ఆఁ! ఆతఁడంతవాఁడా?

బృహ—లేక నేమనుకొంటివి? ఆతని చరిత్రమును దెలిసియు విస్మృతిఁ జెందినట్లున్నావు. అయిన నొకపరి యాతనియుదంతము వచించెద శ్రద్ధతో వినుము.

* సీ. బ్రహ్మణ్యుఁడగు కశ్యపబ్రహ్మవరమున
వినతకుఁ బుట్టిన యనఘమూర్తి,
వాలఖిల్యులదయ వరపక్షికుల మున
కిందుఁడై పరఁగినయిద్ధతేజుఁ
డుదధిలోనున్న యత్యుగ్రనిషాదుల
నారంగ మ్రింగిన, ఘోరవీరుఁ
డిభకచ్ఛపముల రోహిణశాఖతో నెత్తి
కొని దివిఁ బఱచిన యనిలవేగి,

* ఈపద్యము నన్నయభట్టారక విరచితము. భారతము ఆదిపర్వములోనిది.

వీఁగితనతల్లి దాస్యంబు నీఁగఁబూని
తడయకమృతంబుగొని పోవఁగడగివచ్చెఁ,
గామరూపసంపన్నుండు, గామగమనుఁ
డతఁడు నీకు నసాధ్యుండు శతమఖుండ!"

ఆతని మహత్త్వము నీకుఁ గ్రొత్తకాదు. పూర్వము కశ్యపప్రజాపతి పుత్రార్థియై సమస్తద్విజుల, వాలఖిల్యుల, మహాఋషుల సహాయులఁగాఁ గొని కావించిన పుత్రకామేష్టియందు నంగుష్ఠప్రమాణులగు వాలఖిల్యఋషుల నీవవమానించితివి. వారు దాని కలిగి నీకు ప్రతిగా నొకదేవేంద్రునందు బడయప్రయత్నింప నీవు భయపడి కశ్యపుని శరణు జొచ్చితివి. దాననాతఁడు కరుణార్ద్రహృదయుఁడై వాలఖిల్యులఁ బ్రార్థించి వారిప్రయత్నంబులుడిపి నిన్ను రక్షించెను. వారల వచనంబమోఘంబుగాన నాయజ్ఞోద్భవుఁడు దేవేంద్రుఁడు గాక పక్షీంద్రుండు కావలయుననిరి. ఆతఁడే యీగరుడ నామక వ్యక్తి. ఇప్పుడు విశదమైనదా?

ఇంద్ర—అటులనా! అయిన మనసైన్యంబుల వేగఁగూర్చుకొని యీతని పాఱఁదరుమవలయును.

గీ. అమరులకుఁ బ్రాణసమమైన యట్టిసుధను
ఒరుఁడు గొంపోవనుండఁగా నూఱకొనుట
తగదుగావున యోపినంతకును వాని
ప్రతిఘటింపఁగవలె మనప్రతిభ వెలుఁగ.

బృహ—ఔనౌను. వేగ దేవతల హెచ్చరింపుము.

ఇంద్ర—ఓ దేవ యక్షకిన్నరకింపురుష విద్యాధరయోధవరులారా!

గీ. అమృతంబును గొనిపోవసరుగుదెంచు
నొక్కవీరుఁడు మిమ్ములనుక్కడంచి

శక్తినంతనుజూపఁగా సమయమిదిగో
వచ్చె రణమున గాయత్తపడుఁడు వేగ.

(తెరలో)

గరుడుఁడు—నన్ను చూచినంతనే మీరు చెట్టుపుట్టలఁ బట్టి పరువిడెదరేల? ఇటువినుఁడు.

గీ. ఓర్వఁగానన్ను వత్తురో? యుద్ధమనక
అమృతంబునొసంగి సౌహార్దమింత
నెఱపవత్తురో లేశము వెఱపుగొనక
మీరు వచియింపరే సురవీరులార!

బృహ—ఇంద్రా! రమ్ము. రమ్ము. మనమింతలోలోని కేగి యుద్ధసన్నద్ధులము కావలయును. అప్పుడే యీవైనతేయుఁడు విజృంభించి యిటకువచ్చుచున్నాఁడు.

ఇంద్ర—నిజమే. పోదము రండు.

(ఇంద్ర—బృహ—నిర్గమింతురు.)

(ప్రవేశ: గరుత్మంతుఁడు.)

గరు—నన్నుచూచినంతనే మీరు చెట్టుపుట్టలఁబట్టి పరువిడెదరేల? ఇటువినుఁడు.

గీ. ఓర్వఁగానన్ను వత్తురో? యుద్ధమనక
అమృతంబునొసంగి సౌహార్దమింత
నెఱపవత్తురో లేశము నెఱపుగొనక
మీరు వచియింపరే సురవీరులార!

పాకశాసనా! ఓ బర్హిర్ముఖవీరవరేణ్యులారా! వృథగ సమరముచేసి ముప్పుదెచ్చిపెట్టుకొనకుఁడు. ఆవల విచారించెదరు. నావాక్యములకు సరియగుసమాధానమునిండు.

(తెరలో)

దేవతలు—ఓరీ! విహంగాధమా! నీప్రశ్నలకిచ్చుట ప్రత్యుత్తరమీయ నెవ్వరు కనుపెట్టుకొని లేరు. తాటాకుచప్పుళ్ళకు కుందేళ్ళు బెదురునా? నీవేమియజ్ఞానములోనున్నావు? మరలిపొమ్ము.

గరు—త్వరపడవలదు. బాగుగ యోజించుకొని పలుకుఁడు. నీతివేత్తలు సంధిని గౌరవింతురు. దానికొడఁబడి మీలో ననేకులకు మరణమును తప్పింపుఁడు.

దేవ—ఆఁ. అల్లే! ఏమిధర్మోపన్యాసములు! ఓరి! వృథావాచాటా! సంధిమాటల మాటాడక తత్‌క్షణము కాలికిబుద్ధిచెప్పుము. మాతో సంధినీకుకలలోనివార్త. యుద్ధమేవచ్చిన నీచావుమాత్రము నిక్కమగును.

గరు—ఏమీ! మీరు సమాధాన పడవలయునని లేదా? అయ్యో!

గీ. భాగ్యభోగప్రశాంత సౌభాగ్యకలిత
విశ్వమోహనమధురత్రివిష్టపమును
కలుషశోణితధారలఁ గలుపఁదగునె
రక్తపాతంబుసేయుట రాక్షసంబు!

ఇప్పటికిని మీయభిప్రాయములు మారలేదా?

దేవ—ఛీ! ఛీ! మాటాడకు. తల తెగును.

గరు—ఏమి! అయిన నిదివినుఁడు

గీ. అమరకిన్నరయక్ష విద్యాధరాది
గురుతరబలాఢ్య వీరసంగుప్తమైన
సుధననాయాసముగఁగొని సుఖముతోడ
దరలువాఁడ మదీయ సిద్ధాంతమిదియ.

(ప్రవే: కొందఱు దేవతలు)

మొద. దేవ—ఓరీ వీరమ్మన్యా! ఏమీ నీ యపసిద్ధాంతములు? నీకు—

గీ. అమృతంబుగొనుట యతిసులభంబని
బుద్ధిహీనుఁ డెవఁడు బోధచేసె?

రెం. దే—గరుడబలినోసంగి గౌరవింతుముసుధ

మూ. దే—చచ్చుకొఱకుయిటకు వచ్చినావె?

మొ. దే—ఓరీ! టెక్కులరాయుఁడా?

గీ ఆజిము క్కాకలనుదీరి నట్టిమమ్ము
కాఱులఱచినయంత నే కలిగెనొక్కొ
జయముసుకరంబుగానీకు సత్త్వహీన!
తడవుసేయకరమ్ము యుద్ధంబుసేయ?

గరు—నన్నునిష్కారణముగ బాధింపకుఁడు. కేవలము మాటలతో ప్రయోజనము లేదు. మీరునాగరికాగ్రగణ్యులగుదివిజులరు. ధర్మజ్ఞానసంపన్నులరు. యుక్తాయుక్తము లెఱుఁగని బాలిశులు కారు. మీరెల్లరేకమై నాపర్ణశకలమును భేదింపలేరు. అమృతమునిచ్చి నన్నుబంపివేయుఁడు.

రెం. దే—నీ వొకయల్పవిహంగమవనియుపేక్షించినకొలఁదిని తాఁకుబారుచున్నావే? కాఱులుఱవక నీకొలఁది యోజించుకొని వేగమె సుఱిఁగి పొమ్ము.

గీ. మాయమాటలమమ్ముల మగ్నుపఱచి
సుధను చతురతఁగొనఁ జూచుశూరుఁడవని
తెలిసిపోయెను, నీదగుబలమునరయ
మేకపోతుగాంభీర్యంబు గాక యేమి?

గరు—నే నొకయల్పాండజము నే. నేను దుర్బలుండ నేఁగావచ్చును. కాని నాకుఁగలశక్తి యేమో మీకు తెలియునా?

గీ. వినుతపూతసతీమణి వినతమాత
విపులనిర్మలకీర్తి కశ్యపుఁడు తండ్రి
దీవనమిడంగ గెలుపును దేఁగ లేనె?
సాధుతాపసజనవచస్సార్థకముగ.

అనెడు నాయాత్మశక్తి యే మదీయవిజయసముపార్జనైకసాధనము. మీ రూరక యల్పపరికరంబుల నమ్ముకొని నన్నుజయింప విజృంభింపకుఁడు తిరిగిపొండు.

మొ. దే—అది యేమో చూతుము. యుద్ధము సేయుము.

గరు—యుద్ధమే స్థిరపడిన వెనుదీయువా రెవరు? రండు. రండు.
[దేవతలకును గరుడునకును యుద్ధము జరుగును. గరుడుఁడు వారలపై ధూళి రేపి, చీల్చి, కరచి యుద్ధము చేయును. దేవతలలో కొందఱు పాఱిపోదురు. గరుడుఁడు వారి వెంటఁదరుముకొనిపోయి తత్ క్షణము ప్రవేశించును. గరుడుని దేహమంతయు రక్తసిక్తమై యుండును. నేలయంతయు రక్తముతో నిండియుండును. కొందఱు దేవతలక్కడక్కడ పడియుందురు.]

గరు—పొండు. పొండు. మీ రిట్టి పారుఁబోతులని యనుకొనలేదు. అదిగో! ఆపిరికిపందలయార్తనాదములు కాంబోలు వినవచ్చుచున్నవి

(తెరలో)

దేవతలు—ఓ సునాశీరా!

గీ. ముసలముద్గరకుంతముల్ మోఱవోయె,
గరుడపక్షాహతిన్ రజోఘనముకప్పె,

మనవరూథినీచయ మెల్లమడసె, మాకు
చావుదప్పనిగతి దోఁచె కావరావె?

గరు—సరి. సరి. ఈపోటరులందఱు తమదీనావస్థఁ జెప్పుకొని యింద్రునడిగి మఱికొంతబలము కూర్చుకొని వత్తురు కాఁబోలు! కాని! వీరికింత మాత్రమున బుద్ధివచ్చునట్లు లేదు. ఈసారి యొకగట్టిపట్టు పట్టవలయును. అదిగో అప్పుడే దేవతా దర్శనమైనది!

(ప్రవేశ: దేవతలు సాయుధహస్తులై)

మొ. దే— ఓరీ! ఈసారి రమ్ము నీపీచమడంచెదము.

గీ. జాగరూకతగాలేని సమయమందు
ముచ్చువలెవచ్చి మమ్ములవ్రచ్చినంత
పల్కెదవు నీవు నొక పాటివాఁడననుచు,
ఓరిదర్పోద్ధతా యిపు డోర్వరార!

గరు—(విజృంభించి) ఆఁ! ఆఁ! మరల మొదటికి వచ్చినారా? పోనీ! ఇపుడు సన్నద్ధులై వచ్చినారుకద! అయిన భయము లేదు రండు.

(సంకులసమరమున మఱల దేవతలు పారిపోవుదురు.

గరు—ఓహో! ఓహో! ఏమి పౌరుషంబుగా యథాయథలై యసుఘసురులై చెట్టుపుట్టలబట్టి పోవుచున్నారు? ఆహా! ఎట్టి రమ్యదృశ్యము! ఈ దేవతలు

గీ. క్షతజతటినీవిగాహప్రక్షాళనమున
ప్రీతధావళ్య మెల్లను బాసిపోయి
వేకువనె దోఁచు మార్తాండబింబములన
నవ్యరక్తశరీరులై నారలహహా!

గీ. అమరవర్యులరక్తమే యంబువులుగ
తేలిమునుఁగుచునున్న యద్దేవతలత

లలెయరయయబ్జములుగాఁగ వెలుఁగునహహా !
రుధిరపూరితభయదసరోవరములు !

ఓవీరులారా ! రండు. రండు. మిమ్ముల నింతఖండఖండంబులుగఁజీల్చుచున్నను మదీయనఖంబులతీట యడంగకున్నది. గడియ గడియకు మిమ్ములబిలువలేక నా వాయిపడుచున్నది కాని మీరు సమరావని నొక్కని మునమైనఁ ల్చిశక్తికొలఁది పోరినాయుత్సాహ మొక్కింత తీర్పక కాలుకొలఁది పారి నోటికొలఁది యటనుండియే వాగ్యుద్ధ మొనరించుచుండుటచే నాకు కడుంగడు విచారమగుచున్నది ఆలస్యము చేయకుఁడు. రండు. పిఱుతివియక పోరాడి మీగౌరవము కాపాడుకొనుఁడు. లేకున్న చతుర్దశ భువనములకు మేమె చండశాసనులమను ప్రతిష్ఠకిప్పుడు తీరనియవమానము కలుగునుసుఁడీ !

త్వరపడుఁడు. లోనికిఁబోయి యమృతకలశమును దీసికొనిరండు. లేకున్న మీరీ చిచ్చరపిడుగును గడచని జీవించుటదుర్లభము. లోకంబులన్నియు నేకమౌగాక ! నన్ను జయించుటాకాశకుసుమసదృశము. మీమీ ముసలముద్గరపట్టిసకుంతశూలాదియాయుధముల నావలఁబారవేయుఁడు. నిరుపయోగంబులగు నాపరికరంబులు నన్నేమియు చేయఁజాలవు. (హృదయమును చఱచుకొని) వీనినిశ్చయము నొకసారి యాలింపుఁడు.

గీ జన్మహక్కగుస్వాతంత్ర్య చంద్రికలను
గ్రోలవచ్చినయుగ్రచకోరమిద్ది
అట్టిచంద్రికలను నించునట్టిదిసుధ
దానిఁగొనకుండగానిది తఱలిపోదు.

కానుగాని

గీ. పంచబంగాళమయ్యెసుపర్వదళము,
శూలపరిఘాదిశస్త్రముల్ చూర్ణమయ్యె,

ఏఱులై పాఱురుధిరమెల్లెడలఁగాని
యిందఱినిఁగోలుపుచ్చిన యింద్రుఁడేడి ?

జంభారీ ! ఓసహస్రాక్షా ! ఒకసారికంటబడుము నీతోనొకపరి యుద్ధముసేయ మనసయ్యెడిని. రావా ? పోనిమ్ము. అమృతమున్నస్థానమునకుఁ బోయిన పిదపనైనఁగాన్పింపక తప్పదులే! అప్పుడైన నాసమరతృద్బాధ దీరునేమో చూచెదను. ఓవైరివీరులారా ! గరుడుఁడు వచ్చుచున్నాఁడు, అప్రమత్తులరై యమృతమును రక్షించుకొనుఁడు.

(గరుడు ప్రస్థానము.)

తెఱపడును.

తృతీయరంగము.

దేవలోకాంతర్భాగము — మధ్యాహ్నము.

[ఒకయినుపచక్రము గిఱ్ఱునఁదిరుగుచుండును. దానిక్రింద నొక యమృతకలశముండును. దానినిచుట్టి రెండుసర్పములు ఫూత్కారము సేయుచుండును. ఆచక్రముచుట్టు నగ్నిజ్వాలలు వెలుఁగుచుండును. దానిచుట్టు నాయుధధారులగు దేవతలప్రమత్తులై కావలియుందురు.]

[ప్రవేశ : ఇంద్రుఁడు.]

ఇంద్రు — దేవతలారా ! గరుడుఁడు మనదెసకువచ్చుచున్నాఁడు. వెనుదీయక పోరాడుఁడు. మీశక్తినించుకంతయు దాపక నేఁడు ప్రకటింపవలెను అమృతమేపోయినచో మనసర్వస్వము పోయినట్లే. నేఁటివిజయము మీమీఁద నాధారపడియున్నది. మిమ్ములనమ్ముకొని నేను ధైర్యమువహించియున్నాను. మాటదక్కించుఁడు తుచ్ఛప్రాణంబులకాశింపవలదు ఆవైనతేయుని నాయోపినభంగి సమయమువచ్చినపుడు ప్రతిఘటింతును. ఆతఁడొక్కఁడు; మనమో కోట్లకొలఁది యున్నాము.

నేడు మనయోటమియేనిక్కువమైన దివిజులధమాధములని సర్వలో
కంబులకు తేటతెల్లమగును. నిజముగ మీకు మీమాతృలోకమునెడ
భక్తి గౌరవములేయున్న మీప్రాణంబులు వీడుటొక ఘనకార్యముకా
దు. మీస్వత్వరక్షణకై మీకొన్నెత్తురులీపుణ్యలోకమునదడిపివైచిన
మీకన్న పవిత్రులెవ్వరుందురు ?

ఉ. ఆతనినొంటివాని,నొకయండజమాత్రుని, హీనసత్త్వునిన్,
లేతవయస్కునిన్, దునుమలేకగ కావికలైన, మీకుమీ
జాతికనల్పమానవయశంబుఘటిల్లదె ? యింతకన్నమీ
కుక్షతలఁగొట్టుటేమి ? మిముఁగోడిగమాడుటయేమి చెప్పఁడీ ?

గీ. మాతృలోకంబునెడప్రేమ,మహితస్వత్వ
రక్షణంబందువాశక్తి, రాజభక్తి
దైవభక్తిసిచూపెడునపుడుభక్తిఁ
దర్పణముసేయఁ బ్రాణములబ్బురంబె ?

యుద్ధంబందందెవేసిన చేతులగుమిమ్ము నిట్లువిశేషము హెచ్చరింపఁబనిలే
దు కాని యొకముఖ్యవిషయమునుమాత్రము వచించెదను. ఓగీర్వాణవీ
రవరులారా !

మ. భవదీయంబగు స్వత్వరక్షణముకై భవ్యాత్కవోష్ణంబులౌ
నవశోణక్షతజాపగల్ దివినివిన్నాణంబుగాబారి, యీ
దివిజల్లోకము దేవునాలయమటుల్ దేదీప్యమాపద్మరా
గవితానంబును దాపినట్టులయి యాకల్పాంతతేజంబిడున్.

నేనుపోయి విష్ణుదేవునికూడ మనకుసహాయార్థమై తెచ్చెదను. మనకిం
క రవ్వంతయు భయముండదు. మీరు మేమువచ్చులోపల మాత్ర
మమృతకలశ మాగరుడహతకుని చేతులఁబడకుండగాపాడినఁజాలు
ను. చేతనైన వానినీసుధాకలశమున కిటనేబలిపెట్టుఁడు.

మొ. దే— దేవా ! ఆతని యాథార్థ్యమణంప నేనొక్కఁడజా
లును.

రెం. దే— దేవా ? వాఁడు నేఁడు చచ్చినవాఁడే!

మూ. దే—దేవా ? ఈపరి నాకుంతమున వాఁడు బలియగు
ట తథ్యము.

నా. దే—దేవా ! నేఁడు వాఁడీ గండకత్తెర (తనగుండెచఱచు
కొని) దాటి బయటఁబడినప్పటిమాట.

ఇంద్రు— బాగు. బాగు. మీమీఁద నీఘనకార్యనిర్వహణభా
రముంచి నేను నాప్రయత్నమునకుండెదను. బహుభద్రముసుఁడీ !

దేవతలు—అవశ్యమట్లు చేయుఁడు.

ఇంద్రు—దేవతలారా ! మనకీర్తి ప్రతిష్ఠలకు కళంకము—

దేవతలు—రానీయము. రానీయము.

ఇంద్రు—ఇంక నేనేగెద. (ప్రస్థానము)

దేవతలు—మహేంద్రునకు జయమగుగాక ! గరుడుఁడు నేఁడు
చచ్చె. గరుడుఁడు నేఁడుచచ్చె.

(తెరలో)

వచ్చె. వచ్చె. వైనతేయుఁడు వచ్చుచున్నాఁడు. అమృతము భద్రము.
అమృతము భద్రము.

దేవతలు— (ఒడలు గగుర్పొడుచుట నభినయింతురు.)

(తెరలో.)

గీ. పాడుప్రాణంబులకు నాసపడకుఁడయ్య
బలముకొలఁది పోరాడఁగావలయునయ్య
అమృతంబునమనకీర్తి యలరుగాన
దానిభద్రంబుగాఁ గాయఁబూనుఁడయ్య.

మొ. దే—(భయముతో) గరుడుఁడు వచ్చుచున్నాఁడా?

రం! దే—గరుడుఁడే!

మూ, దే—ఐననేఁడు......మనము ... జీవింపఁగలము ?

నా. దే—నాచేతినుండి కుంతము క్రిందకు జారిపోవుచున్నది. (మొ. దే. తో) అన్నా! నిన్నుచాటుగాఁ జేసికొని నీకుంతమునకు బలి జేయుటకొప్పుకొందువా?

మొ. దే.—చాలులే! నాహృదయము బ్రద్దలైపోవుచుండ నీ గతి యెవ్వనికికావలయు?

మూ. దే—కాని! నేఁడుకొంచెము పౌరుషముగా చావవల యునురా?

రం. దే.—అనఁగా చావు మనకు తప్పదనెదవా?

నా. దే—వాఁడనుటయేమి...... అదిగో! వాఁడనును. ను. ను. ను. ను. ను. ఉ. ఉ—

మొ, దే—ఏమిరాఅది? (ముందునకుజూచి) గరుడుఁడు! గ రు—గారు.— గరూ—

[ప్రవేశ : గరుడుఁడు రక్తసిక్తుఁడై,]

గరు—(చేయెత్తి) ఓవిబుధయోధగ్రామ్ణులారా! ఓపురం దరా!

గీ. వైరవిధ్వంసకుండను వైనతేయుఁ
డనెడివాఁడను సుధఁగొననరుగుదెంచి
మిమ్ముఁజక్కాడుదొక్కఁడ, మిత్తినోట
మీరలున్నారు సురలార! మేలుకొనరె?

ఉ. ఓసురవీరులార! విజయోద్ధతుఁడై వినతాసుతుండు మీ
వాసముజొచ్చె, పోరఁగలవారరుదెండు, విలాసలీలలన్

వేసటపుట్టలేదె? ఇఁక వేడబముల్ బచరింపఁ జెల్లునే?
మూ సము లేరులేరనెడు మాటలు బోటయి పోయె నేటితో

గీ. విబుధరక్తోరుకశ్మలద్వీపవతుల
మజ్జనంబాడి మాంసముమడగఁదొక్కి
ఆహవ్రాత్యాహమునసుంటి, నమరులార
ఇపుడునన్నడ్డఁగా మీరలెంతు రేని
సరవినేతెంచు జీవన సంధ్యమీకు.

మొ. దే—గీ. ఓరి! విబుధులతోడనా పోరు నీకు?

రం. దే— రార! కాలముమూడెనురా! దురాత్మ

మూ. దే— కాఱులఱచినభీతిలువారలెవరు?

నా. దే— వెఱ్ఱివైపోరకీవింక వెడలిపొమ్ము.

గరు—రండు. రండు. వృధాప్రగల్భములాడకుఁడు. మీశిధిల మస్తకంబులతో నేనిపుడు బంతులాటయాడుకొనవలయును. తడవుసే యకుఁడు.

దేవతలు—రమ్ము. రమ్ము. పెద్దచేటలవలెనున్న నీఱెక్కలతో మాకుమారికలు నాడుకొన నువ్విళులూరుచున్నారులే!

[సంకులసమరము జరుగును. మొదటివిధముననే గరుడుఁడు యుద్ధముసే యును. దేవతలుకొందఱు హాహా కారములుసేయుచు బారిపోదురు. కొందఱచ్చట స్మృతితప్పి పడియుందురు. ప్రదేశము రక్తముచే తడియు ను. ముక్కలుగ శరీరభాగములచ్చటచ్చట బడియుండును.]

గరు—(అట్టహాసముతో) సరి! ఇక్కడితో వీరియుద్ధమంతము నకువచ్చినది. ఇంకనమృతమును గొనిపోవలయును. ఇచ్చటికింతలో నె వ్వరు రారని తోఁచుచున్నది. (ఇనుపచక్రము వంకజూచి) ఆఁ!...... అదిగో! ఆసర్పద్వయముమధ్య—ఇనుపచక్రముక్రింద—ఈదారుణాగ్ని

కీలలలో నీసుధయున్నది. అబ్బా ! నిజముగ దీనినిఁ గొంపోవుట నేను తలఁచినంత సుకరముగా లేదు. (ఆలోచించి) ఇపుడేమి చేయుదును?...... ముందీ అగ్ని నార్పవలయునుగదా ! సరే ! ఇపుడే పోయి సముద్రోదకంబులఁ దెచ్చి దీనినార్పెదను.

(ప్రస్థానము.)

[పవేశ : గరుడుఁడు బుగ్గలనిండ నీరుసంపుకొని]

గరు—(అగ్ని నార్పివేయును.) ఇఁకనీయయోచక్రమా ! ఇది యెంతసేపు ? (హుంకరించి బలముతో తిరుగుచున్న చక్రమును బట్టుకొని ముక్కముక్కలు చేసి యావల బార వేయును.) అబ్బ యిక్కడికీ చక్రబాధవదలినది. కాని ఎల్లెగినను నన్నే కనుపట్టి చూచుచున్న యీదుష్టభుజంగముల జంపుటెట్లు ? అయ్యో ! వీనికి పురందరునకు బలె సహస్ర నేత్రములు లేవుగదా ? (పాములచుట్టును దిరుగుచుండును.) హా! హా!

గీ. కటుభయంకరఫూత్కారచటులరవము
లనుసదా జేయు హాలహలంబుదిశలఁ
బర్వఁ జేయుచు ఘోరమాపన్నగేంద్ర
యుగము వీనిని నెట్టులనుక్కడంతు ?

(ఆలోచించి) కానీ యిట్లు చేయుదును. (పైకెగిరి పాముల కండ్లబొడిచి ముక్కుతో వానిని తుండెములుగాచీల్చి వేయును.) అమ్మయ్య ! ఇక్కడకు కృతార్థుఁడనైతిని. ఈనీచవ్యాళముల ప్రాణములంతరించినవి. నా ప్రాణములు కుదుటఁబడినవి. ఎంతగొప్పసర్పములివి ? నేనన్నట్లివి నీచమైనవి కావు. స్వామిభక్తిపరాయణ చిత్తమున బ్రదికియున్నంతవరకు రాజభక్తిగనుపరచి వీరజనోచిత మరణమును తుదనందిన యివి మహోదారభావసద్గుణశోభితలు......(ఆనందముతో) ఓహో ! ఇది

యా అమృతము. (కలశమును సమీపించి) ఓ పవిత్రామృతమా ! (నమస్కరించి కలశమును చేతపట్టుకొని) ఇపుడు నీవు నాయధీనమవైనావు. నేనింక నమరావతిని విడిచి చల్లఁగ కద్రూకుటీరమునకు దారిదీయవలయును. వైరులెవ్వరిఁక రారా ? ఆ సుత్రాముఁ డేమైనట్లు ? అదిగదిగో (ముందునకుచూచి) కొందఱు రణనిహతులఁ గూర్చుకొని నన్ను పోరవచ్చుచున్నారు. ఇంకను యుద్ధమంతరింప లేదు. తండ్రీ ! కశ్యపప్రజాపతీ! వినతామహాదేవీ ! దేవా ! మాధవా ! మీయాశీర్వచనబలంబున వారిజయింపఁబోవుచున్నాను. వారినోర్చు విక్రమము, ధైర్యము నాకుఁ బ్రసాదింపుఁడు.

(తెరలో)

" అట్లేయగుఁగాక ! "

గరు—(ఉలికిపడి) ఎవరిట్లు పలికినది ? (నలువంకలఁజూచి) ఇచ్చట నెవ్వరు లేరు. (ముందునకుఁజూచి) ఆ సేనలా ! అవి చాల దూరమునను న్నవి!...... ఓహో! తెలిసినది. ఇవి నా శ్రేయోభిలాషులగు మహనీయుల దివ్యవచస్సులు. (ఆకాశమువంకజూచి) అదృశ్యులగునో ఆర్యులారా ! మీయాశీర్వచనంబులే నాకుబలము కలిగించుఁగాక !

(ప్రస్థానము.)

తృతీయరంగము.

వైకుంఠముననొకమందిరమందు. సాయంతనము.

[విష్ణుమూర్తి శేషశాయియైయుండును. కొందఱు దేవతలుఋషులాయనను పరివేష్టించియుందురు.]

విష్ణు—శేషా ! నీతల్లిసంతానమున నీవొక్కఁడ వేధన్యుఁడవు కొలఁదియైనను మహాత్మ్యసంపన్నంబగు నీతపము బ్రహ్మదేవునికలంచి

వైచినది. నన్నాకర్షించినది. మహాభక్తుండవగు నీచరిత్రము పవిత్రమై యాచంద్రార్కము వెలుఁగుగాక ! పదివేలకు నీవు నా పర్యంకమవై వర్ధిల్లుము.

శేషు—(తలనూపియంగీకారము తెలియజేయును.)

[ప్రవేశ: ఇంద్రుఁడు దూరమున]

ఇంద్రు—దేవా ! వైకుంఠాధిపా ! (మ్రొక్కుచు)—

గీ. దైత్యసంహారకా ! వరదా ! నమోస్తు !
భక్తజనకౌస్తుభా ! ప్రతిభా ! నమోస్తు !!
దుఃఖపరిహార ! దీనబంధో ! నమోస్తు !!!
నిఖలనిర్జరచింతామణీ ! నమోస్తు !!!!

మమ్మునీక్షణమున వచ్చి రక్షించినఁగాని బ్రదుకఁజాలము. (ఆయాసపడును.)

విష్ణు—(విస్ఫారితనయనములతో) నేఁడేమి గండకత్తెర వచ్చిపడినది ? వాహనమైనను లేక, తోడైన లేకుండ నీగతియిటకు దుంపలుదంపలు చేసికొని పరువిడివచ్చునంతటి విశేషము లేమిపుట్టినవి ?

ఇంద్రు—అయ్యయ్యో! ఇంకను విశేషము లేమని మెల్లఁగ నడుగుచున్నావా ? మాకొంపమునిఁగిపోవుచుండ నాకు వాహనములు, వైభవములు, అంగరక్షకులెందుకు ? రమ్ము. రమ్ము.

విష్ణు—ఇంద్రా! స్వస్థతఁజెంది నీయాకుల పాటునకు కారణము వచింపక నిగర్ధక వాక్యముల—

ఇంద్రు—(అర్ధోక్తిలో) అయ్యో ! నీవెఱిఁగియుండియు నావలన నే సర్వము వినఁగోరెదవే ? ఏమని వచింతును ? ఎవ్వఁడో గరుత్మంతుఁడట మా స్వర్గలోకములో చొఱబడి దేవయక్ష కిన్నర కింపురుషాది యోధానుయోధుల తన నఖంబులతోను ముక్కుతోను శరీరంబుల

చీల్చి ఱెక్కలతో ధూళిరేపి కన్నులబోసి సర్వసైన్యంబుల చిందఱవందఱచేసి శీర్షంబులచిద్రుపలుచేసి దివిజలోకంబును రక్తనదులలో ముంచియెత్తి సుధాకలశమును గొనిపోవనున్నాఁడు.

విష్ణు—(స్వగ) ఏదియో గొడవ తెచ్చిపెట్టి నన్ను నిరంతరము బాధించువీని కీమాత్రపు పరిభవము కావలసినదియే ! (ప్రకా) మీకన్న బలవంతుఁడగు వానికి మీరు లోబడి సుధనీయక తప్పునా ?

ఇంద్రు—దేవా ! బాగుగ చెప్పితివి. నీవీవిపత్కాలమున నరుదెంచి మమ్మాతని బారినుండి గావకున్న మాకుగత్యంతరము లేదు. మమ్ముల నింక వేధింపక వేగిరము రమ్ము.

విష్ణు—ఇంద్రా ! పాపము ! మొదటినుండియు నిన్ను మేము వేధించుచునే యున్నాము. మిమ్మింకను వేధించుటకా మమ్మాహ్వానించుచున్నావు ? ఓహో ! కృతజ్ఞత !

ఇంద్రు—దేవా ! అత్యంత బాధాపరితప్తంబగు నాహృదయమునుండి వెలువడిన కఠోరవాక్యములను క్షమింపుము. మమ్ము పాలముంచినను నీటముంచినను నీవే ।

విష్ణు—(చిరునగవుతో) ఇంద్రా ! భయపడకుము. నీశక్తికొలఁది వానితోఁ బోరుము. విజయము సిద్ధించెనా సరియే. లేకున్న వానిమైత్రి చేసికొని సుధను సాధింపుము.

ఇంద్రు—(స్వగ) ఈతనివరుస యెప్పుడును పిల్లికి చెలగాటము ఎలుకకు ప్రాణసంకటమన్నట్లుండును. (ప్రకా) మాధవా ! నీసాహాయ్యముచే వానిని మట్టుపెట్టవచ్చిన నాకు మంచి యుపదేశము చేసి సాగనంపఁదలఁచుకొన్నావు. బాగు. బాగు. నివువానితో యుద్ధము చేయరావా యేమి ?

విష్ణు—(స్వగ) కష్టపడకున్న సౌఖ్యముయొక్క విలువ తెలియదు. ఈతని నొకయాటయాడించిచూతును. (ప్రకా) సరి. సరి. ఆతని నే నో

డించుటయా ? ఆమాటకేమిలే ! ఇంతకును నాఁడు నీవజ్రాయుధమునకు కూడ లొంగ లేదా ?

ఇంద్రు—లే ...... దు ...

విష్ణు—ఏమిలేదు ?

ఇంద్రు—ఆతనితో నేను యుద్ధమే చేయ లేదు.

విష్ణు—(వికటముగా నవ్వుచు) ఆ; ? నీవు యుద్ధమే చేయ లేదా? వారిని వీరిని నలుగురను బంపి నీవు చెక్కు చెదరకుండ కూర్చొని నివాంతు వచ్చునప్పటికి నీస్థానమున నన్ను నియోగించి యంతఃపురమున రంభాద్యప్సరోకామినీ విపంచికాగానలహరినోలలాడుచుండ నెంచి యిచ్చటకు వచ్చితివా ? చాలు. చాలు. ఏమి విచిత్రస్వరూపుఁడవు? పోయి నేనువచించినట్లు గావింపుము.

ఇంద్రు—ఎట్లయిన నాసుధ నాకుదక్కునా ? ఈవిషయము మాత్రము చెప్పుము పోయి వానితో పోరెదను.

విష్ణు—భవిష్యత్తుమాట దేవుఁడెఱుఁగును. నీవిట్లాలస్యము చేయుచున్న యమృతము విషముగును సుమా !

ఇంద్రు—అట్లయిన నేనేగెదను. నీవు యుద్ధము చేయక పోయిన పోనిమ్ము. చెంతనుండి రణోత్సాహమునైన మాకుఁ గలిగింపరాదా ?

విష్ణు—ఆముచ్చటచూచుట కచ్చటకు నేను తప్పక వచ్చెదను. నీవు వేగపొమ్ము.

ఇంద్రు—చిత్తము.

(తెఱ వ్రాలును.)

ఇంద్రు—ఛీ ! ఛీ ! నాకు పునర్జన్మమే యున్న నింద్రత్వమును వేయిజన్మములకైనను కోరుకొనను. ఆహా ! ఈచిగిరింతమైశ్వర్యము

జూచికొనియా నేనింతకాల ముప్పొంగుచుండును ? ఇపుడు నాయవస్థ యెంతదుర్భరముగానున్నది ?

సీ. కామితంబులఁదీర్చు కల్పవృక్షంబిట్టి
కష్టంబులనుదీర్పఁ గలదె నాకు ?
నిర్మలమందాకినీ నీరములు నాదు
కష్టజంబాలంబుఁ గడుగఁగలవె ?
కలితసౌరభమంద మలయానిలుఁడు నాదు
దుఃఖఘర్మంబులఁ దుడువఁగలఁడె ?
అమలమోహనశీతలానందకౌముది
చింతాతమస్సును జీల్పఁగలదె ?
మకుటమండితమైనంతమస్తకంబు
అంగదంబులఁ దాల్చినయంతనుండి
బాహువుల్ పెక్కు వేధలఁ బడెడు, నెంత
హాయియో బాధయంత సింహాసనమున !

(ప్రస్థానము.)

చతుర్థరంగము.

ఇంద్రలోకము. — సాయంతనము.

[విష్ణుమూర్తి యిటునటు తచ్చాడుచు లోనజరుగుయుద్ధమును బరికించుచు యోజించుచుండును.]

విష్ణు—(యుద్ధరంగమును చూచుచు) ఓహోహో ! ఈవైనతేయుఁడెంతనైపుణ్యముతో నమృతమును గొనిపోయి యిపుడు దేవేంద్రాది యోధానుయోధులతోఁ దలఁపడి విక్రమంబున విజృంభించి వారల నొక్కొక్క పరినురుమాడుచు కాందిశీకులగావించుచు త్రివిక్రముఁడనగు నాకుఁగూడ వెఱపుబుట్టించు క్రమమున పిఱుతివియక పో

రాదుచున్నాఁడు ! హాయి ! హాయి ! ఏమిమనోహరదృశ్యమిది ! గరుడా ! ఎంతలాఘువముగా—ఎంత పాటవముతో—ఎంతస్థయిర్యముతో పాకశాసనాదివైరికోటినిఁదాకుచున్నావోయి ?

గీ. కలితస్వర్ణవిభాసిత గాత్రుఁడితఁడు
రభసమునఁబోయిత్రిదశులరాయుచుండె,
ప్రబలవేగోద్ధతిన్ జోరఁబారునెక్క
ఘనతరంగిణిజలనిధిఁ గలియునటుల.

ఓహో! ఒక్కొక్కతరి నీతఁడు సంరంభించివేయు కేకలకే యందఱు పలాయనులగుచున్నారు.

గీ. ప్రబలసంవర్త జలధరధ్వానసదృశ
మతిగభీరవిభీషణ మైనగర్జ
నంబులసుపర్వవాహిని సంబరపడ
సేయు,క్షుద్బాధితంబగు సింహమట్లు.

ఈతఁడేనాకు వాహనముగుటకుఁదగినవాఁడు. భుజబలంబునకు మించిన యీతనినైతికవర్తనమునన్నాశ్చర్యార్ణవవీచికలఁ దేలియాడఁజేయుచున్నది. ఓవైనతేయా ! పుణ్యజనోచితహృదయా

కం. నీచేజయింపఁబడిరీ
వాచాలురుదివిజవీరవరులందఱహా !
నాచేనుతింపఁబడితివి
నీచర్యలఁజూపి భాగ్యనిఖిలమునీ దే !

శా. నిన్నున్ బోలు దయాసుధానిధి మహానిష్కాము చిత్తంబునున్
నిన్నుంబోలుమహాబలాఢ్యుఁ డెవఁడీనీ రేడు లోకంబులన్
కన్నాకైతి విభూతలత్రిదివలోకావాసులందందఱన్
అన్నా ! అంతియ కాక కూర్చితివి నా కత్యంతసంతోషమున్.

అదిగో ! అదిగో ! అప్పుడే యమృతకలశంబుతోనిట కీ సుకృతుఁడు వచ్చుచున్నాఁడు. తానమృతంబుఁగొనియు దానినిఁ ద్రావఁడు. ఈతఁ డెంతఘనుఁడు !

(ప్రవేశ : గరుఁడుఁడమృతకలశముతో)

గరు—విష్ణుదేవా ! నమస్కారము. క్షణముక్రింద నన్ను దీవించినది నీవేనని తెలిసికొనలేక నీయెడ మహాపచారమును చేసితిని. భవదీయాశీర్వచన ఫలంబున నన్నెదిర్చినవారిని జయించి మాఅమ్మదాస్యమును దీర్ప నమృతంబునుగొని పోవుచున్నాను.

విష్ణు—దానికేమిలెమ్ము. నీవర్తనమునాకు చాల ముదము గొలిపినది. గరుడా ! నీకేవైనవరములు నావలనఁ గావలయునేని కోరికొనుము.

గరు—దేవా ! అనుగ్రహింపబడితిని. నాయపరాధముల క్షమించి నన్నెల్లప్పుడు గావుము. దేవాదిదేవా ! మధుసూదనా ! ఇట్లనుగ్రహింపుము.

గీ. అమృతంబును గ్రోలకే యమరపదవి
అఖిలలోకంబులకునెల్ల నధిపతివగు
నీదుభక్తుల మిన్నఁగా నాదరింపఁ
బ్రార్థనముసేతు దేవ ! పురాణపురుష !

విష్ణు—అట్లేయగుగాక! నాకుఁగూడ నీవు వరము లొసఁగవలెనోయీ! నాకిచ్చటినుండి వాహనమై ధ్వజమై ప్రీతిసేయుము.

గరు—మహాప్రసాదము. నాకింతకన్న గావలసినదేమున్నది ? భవదీయపాదసేవయందే నాతనువు సాఫల్యము నొందుగాక ! అదియే నామహదాశయము. దానినిఁ దీర్చి నన్ను కృతార్థునిఁ జేసితిరంతియ చాలును.

విష్ణు—గరుడా! నామాట మరువకుము. నీకు శుభమగుఁగాక! నేనేగెద. (ప్రస్థానము.)

గరు—ధన్యుఁడను. ధన్యుఁడను. నాపుణ్యమే పుణ్యము.

గీ. ధన్యమయ్యెను నాజన్మ ధన్యమయ్యె
జగము బుట్టింపఁ బెంప నాశనము జేయ
సర్వశక్తిమయుండగు శౌరిపాద
పద్మములఁ బూజ చేసెడు భాగ్యమబ్బె.

గీ. ఎవని సందర్శనముగోరి ఋషులు సురలు
తపము సేతురొ ప్రాణముల్ ధారవోసి
అట్టి పరమాత్ము దర్శనమబ్బె నేఁడ
యాచితంబుగ ధన్యుఁడనైతినహహ!

సీ. ఎవని కృపావర్ష మేప్రొద్దు భక్తుల
జీవింపఁ జేసెడు జీవనమ్మొ
ఎవని యభయత్రాణ మెల్ల యఘతమంబుఁ
బాపెడునట్టి మరీచియగునొ,
ఎవని యాదరశీత లేక్షణంబులు శక్తి.
దంబైన పీయూషధారలగునొ
ఎవని పాదపరాగమెల్ల చింతాద్రుల
పాలికి కులిశాయుధ ప్రాయమగునొ,
ఎవని మూర్తి నిదర్శింప నెడద యెల్ల
నిండి ముదమున కన్నుల పండువగును,
అట్టి మహనీయుఁడే నన్ను నాదరింప
వచ్చెనహహ! నాయదె భాగ్యమనఁగ!

ధ్రువ. అసితవారిదపంక్తులెల్ల మహాత్ము నీతనువర్ణముఁ
విసువులేక నుతించుచుంబర వీధి నెప్పుడు బారు, ని

యసముసంస్తుతిఁ జేయఁగా ముకినంతసించెడు చంద్రుఁడుఁ
కుసుమముల్ హృదయంబుఁ బోలఁగఁ గోరి మార్దవమొందెడుఁ.

(తెరలో.)

ఇంద్రుఁడు—ఓరీ! గరుడా! ఎందుబోయెద వెందుబోయెదవురా?

గరు—(భక్తిరసతన్మయత్వమున నింద్రుని మాటలు వినఁబడక వేఱొకదారిని నిర్గమించును.)

[ప్రవే, విష్ణుఁడు.]

విష్ణు—(సవితర్కముగ తనలో) వేయిమన్వంతరముల తపమెందుకు? గరుడుఁడొకయరఘడియ కాలము చేసిన స్తుతిచాలదే పరమేశ్వరసాక్షాత్కారమునకు? పరమేశ్వరుఁడెన్ని వరములొసఁగిననవి యితని వినిర్మలవినిశ్చలవిశ్వవిభ్రాజితభక్తికి కానుకలు కాఁగలవు? హా! ఏమిధన్యజీవి! ఈతనిభక్తిప్రేమపాశములకుఁ గట్టువడి యాకర్షింపఁబడి వైకుంఠమునకు పోయినవాఁడ నిటకు మఱలి రావలసివచ్చినదే! కానిమ్ము. నేనిపుడు వీనికంటఁ బడుట మంచిది కాదు. (ముందునకు చూచి) అదిగో! ఇంద్రుఁడు రణోన్మాదుఁడై యిటకు వచ్చుచున్నాఁడు. ఈతఁడీసారి తన మహోగ్రాయుధముల బలమా తపస్విపై నెంతవరకు పనిసేయునో తెలిసికొనునుగాక!

(తెరలో)

ఇంద్రు—ఓరీ! గరుడా! నీగర్వమీ దారుణాయుధముతో—

(ప్రవేశ ఇంద్రు)

ఇం—(విష్ణుని దూరమున జూచి రణోత్సాహోన్మాదమున గరుడునిగా భావించి) నిర్మూలమగుదువురా! ఓరీ! (విష్ణునిదరి జేరి) ఆహా! దేవా! తమరిట కెప్పుడు మరల వచ్చినారు. మిమ్ములనే గరుత్మంతునిగా భావించిన నాదోషమును క్షమింపుఁడు.

విష్ణు—దానికేమిలే! చేసినతప్పుల దిద్దికొనుచుండుటయేనీపని. గరుడుఁడా ప్రక్కనున్నాఁడు. పోయి నీమారణాయుధముల మహత్త్వ మాతని దగ్గఱఁ బ్రదర్శింపుము. కథ యడ్డు దిరిగిన యెడ సంధి చేసికొనుట కభిమాన పడకుము. పొమ్ము.

ఇం—చిత్తము.

(వేగముగ నిర్గమించును.)

విష్ణు—ఫలమాశించిన కష్టపడవలదా? (వేరొక త్రోవను నిష్క్రమించును.)

(ప్రవే: గరుడుఁడు)

గరు—(ఎదుటదూరముగా లోవనున్న ఇంద్రుఁజూచి) ఏమీ! ఇంద్రుఁడు నన్నెదురవచ్చుచున్నాఁడా? రానిమ్ము.

(తెరలో)

ఇం—గరుడా! పోకుము. పోకుము. నీప్రయత్నము వలీముఖ నారికేళన్యాయమువలె నిష్ఫలము. అందనిమ్రానిపండ్ల కఱ్ఱులు జాపకుము. దీనితో నీగర్వము సర్వమణఁగును. కాచుకొనుము.

(ప్రవేశ: ఇంద్రుఁడు)

ఇం—ఓరీ! దురాత్మా!

గీ. సురద్విషల్లోక దుర్జనశరధికెల్ల
భైరవౌర్వశిఖాచయ మాచుఁబ్రబలి
జంబువృత్రాది శాత్రవ సత్క్షతజధార
లారగ్రోలిన దంభోళి నడ్డరమ్ము.

గరు—అన్నా! వజ్రాయుధమును ప్రయోగించి పరిభవము తెచ్చిపెట్టుకొనకుము. లేకున్నవా పిదప విచారించెదవు.

ఇం—ఇంక ప్రగల్భము లాడకుము. దీనిని చేతనైన నెదుర్కొనుము.

గరు—సరియే! ఓవజ్రాయుధమా!

గీ. ఏతపసియస్థి నిర్మితమీవౌ, ఎవని
హస్తమున కీప్రభావణంబగుదో వాని
గౌరవింపఁగ వజ్రమా! కడఁకతోడ
పక్షశకలము నొకదాని బలిగఁగొనుము.

ఇం—(వజ్రాయుధమును ప్రయోగించును.)

గరు—(తనతెక్కకు వజ్రాయుధము తగుల తెక్కల విదిర్చివైచును ఒకతెక్కలోనుండి పెద్దయీక క్రిందబడును.)

ఇం—(ఆశ్చర్యపడును.)

గరు—ఇంద్రా! ఇంతకన్న నీభయంకరాయుధమునకు వినయముచూపను. నిన్నమర్యాదసేయుట నాసంకల్పముకాదు. వైరభావముతో నాచను పథమున నిలువవలదు. నీక్షేమమును యోజించుకొనుము. పొమ్ము.

ఇం—(స్వగ) ఏమి విచిత్రమిది!

గీ. ప్రళయదారుణమైన వజ్రాయుధంబు
పడియునింతకు బ్రదికినవారు లేరు,
అట్టిదీతనికడ వృథయయ్యె నౌర!
తటిని వీచికలద్రినిఁదాకుమాడ్కి.

త్రిపురాంతకుండగు ఫాలాక్షునకేని యింత విక్రమంబు గానము. ఈతనితో సఖ్యమొందుటయైన మంచిదే. ఎఱుక పిడికెడు ధనముకదా! (గరుడుని చెంతకుజేరి ప్రకాశముగా) మహాత్మా! వైనతేయా! నీవు నేటినుండియు "సుపర్ణుండను బిరుదుపేరఁ బిలువఁబడుదువుగాక! విహంగ

సార్వభౌమా! నీధైర్య గాంభీర్యౌదార్యబాహువిక్రమంబుల నంతము లసమానము లనివార్యములు సంస్తుతిపాత్రములు. నీతోడ నెడతెగనిమైత్రి చేయుటయే నాకోరిక. అనుగ్రహించి నీబలమెంతయో చెప్పిన కర్ణరసాయనంబుగ విందును.

గరు— దేవా! పురందరా! భవదీయ వాంఛానుసారము నీతోడి సుస్థిరమైత్రి నాకుఁ గలుగుఁగాక! నాకోలఁది యింతయని యూహింపరానిది. సహింపరానిది. వాసవా! ఉత్తములు తమ్ముదాము స్తుతించుకొనరు. అందు పని వడనిదే తన్నుదాను నుతించుకొనువాఁడు లోకగర్హ్యుఁడగుచున్నాఁడు. ఒరులడిగినపిదప దనగుణంబులు చెప్పుకొనుట తగును కాని తనంతదా మాత్రము చెప్పుకొనరాదు. సోదరా! నీవిప్పుడడిగితివి కాని మిత్రునిగా భావించి నా వృత్తాంతము నీకు చెప్పెదను వినుము. నగరారణ్యపర్వతనదీసంయుతంబగు నీచతుర్దశభువనంబులను, ఇందు కొంతకధిపతివగునిన్నునుగూడ నెక్కపక్షముపై ధరింపఁ గల్గుదును. ఈసర్వలోకంబుల నొక్కటిగాఁ జేర్చి ముద్దచేసి యశ్రమంబున నెత్తికొందును. దేవా! నాబలమింతియ.

ఇం—నీవాక్యంబులు నాకానందము గూర్చినవి. నీవంతటి బలశాలివగుట నిస్సంశయము. మనస్నేహము మాత్రము సుస్థిరమైయుండవలయును. సోదరా! ఈయమృతము నీకెందులకు? అమృతమును ద్రావకుండఁగనే నీకమరత్వ మబ్బినదికదా! దీనితో నీకు నిమిత్తము లేకున్న నాకిమ్ము. నీవేరికైన దీని నొసంగుచో వారు మావినాశనమును దలపెట్టెదరు. నీవు దయామయుఁడవు. మమ్మట్టియధోగతికిఁ దేకుము. మమ్ము కరుణింపుము.

గరు—దేవరాజా! నీకాభయమావంతయు నక్కఱలేదు. దీనిని నేనొకానొక కార్యార్థమై కొని పోవుచున్నాను. వారికి త్రాగుటకిచ్చుట నాతలంపుకాదు. దీని నెచ్చోట నేనుంతునో యచ్చటికీవరుగు

దెంచి నీపదార్థమును నీవు తీసికొని పోవచ్చును. దానికి నాయాటంకమేమియు లేదు.

ఇం—ఖగేంద్రా! నీవాక్యములకుఁ జాలసంతుష్టుఁడనైతిని. నావలన నేవైన వరములఁ గోరెదవేని చెప్పుము తడయక యిచ్చెదను.

గరు—ఇంద్రా! నీసుహృద్భావమునకు చాలముదమగుచున్నది. నేనన్నిటికిఁ బ్రభుండనయ్యును నీవు దేవలోకాధిపతి వగుటచే నిన్నొకటి యర్థించుచున్నాను. మహాబలవంతులగు నాగుల నాకాహారముగా చేయుము.

ఇం—సుపర్ణా! అట్లే కానిమ్ము. ఇఁక నే బోయెదను. (స్వగ) ఈతని వాగ్దాన మెంతవరకు నిజమో!

(ప్రస్థానము)

గరు—అబ్బ! ఎంతవేళ మించినది. త్వరగఁ బోవలయును (నిర్గమింప నుండ)

(ప్రవే: ఇంద్రుఁడు)

ఇం—గరుడా! నీవమృతమును గొనిపోయి నియమితస్థానమున నుంచిన తోడనే నేనెత్తుకొని పోదునుసుమా!

గరు—అట్లేచేయుము. దేవా! నాకు సెలవిమ్ము.

ఇం—మంచిది. నీకుశుభమగుఁగాక!

గరు—నమస్కారము. (ప్రస్థానము)

ఇం—చిరంజీవివగుము. ఓహో! ఈతఁడెంత మహాత్ముఁడు! అదేమి! (ముందునకుఁ జూచి) మఱియేదియైన నుపద్రవము కలిగెనాయేమి? ఈ దేవతలిట్లు నాచెంతకు పరువిడి వచ్చుచున్నారు.

(ప్రవే: కొందఱు దేవతలు రభసముగ)

దేవ—(తొందరతో) దేవా! ఆతఁడేమయ్యె?

ఇం—(విసువుతో) ఆతఁడెవరు?

దేవ—అయ్యో! అతఁడే! ఇంతవరకు మనల తెక్కముక్కాడకుండఁ జేసిన పక్షిరాజు.

ఇం—గరుత్మంతుఁడని చెప్పరాదా? ఆతనివలన మీకింక భయము లేదు. నామైత్రిని జేసికొని యాతఁడిప్పుడే మర్త్యలోకమునకుఁ బోయినాఁడు.

దేవ—అదిగో! అది తెలిసికొనుటకే యిటకు వచ్చినాము. ఇంక భయము లేదు. అమృతము పోయినట్లేనా?

ఇం—లేదు. లేదు. ఇఁకనొక ఘడియకు దానినిఁ దెచ్చి యథాస్థానమున నుంచెదను మీరు పొండు.

దేవ—చిత్తము.

(ప్రస్థానము.)

ఇం—గరుడశబ్దముతో నీత్రివిష్టప మంతయు ప్రతిధ్వనించుచున్నది. ఓహో! వైనతేయుఁడా? సాక్షాద్విష్ణుఁడాయితఁడు?

సీ. మొక్కవోవని శక్తి ముక్కోటిసురలను
గొట్టి జయించిన ఘోరబలుఁడు,
కరతలామలకంబుగా సుధ యున్నను
తానుద్రావని మహోదార హృదయుఁడు,
సుధ ద్రావక మరత్వ సుస్థిరపదవి, శ్రీ
హరిచేత పొందిన యవని సురుఁడు,
గోవిందు నన్నును గోరకే వరములఁ
గొన్నట్టి భక్తలోకోన్నతుండు,

మాతృదాస్యవిమోచన మహితకార్య
మాచరించుటకై ప్రాణమైన నిడఁగ
వచ్చి, జయమును గొన్నట్టి వ్రతపరుండు,
దళితశాత్రవుఁడీ గరుత్మంతుఁడహహా!

ఓహోహో! ఇట్టివారల జన్మంబులే జన్మంబులు. ఇట్టిమహనీయునితోడనా మేము కలహమునకుఁ గాలుద్రవ్వినది! నోటికొలఁది కాఁకులు ప్రేలినది. పాపము శమించుగాక! పాపము శమించుగాక! ఔరా! ఈతని పరాక్రమంబు తలంచుకొనినప్పుడెల్ల నా శరీరము జలదరించును. ఇంకొక విచిత్రము.

గీ. ఇంత కవ్వఁడు శ్రీహరి నోంచి, వేలు
కోట్లకొలఁదిగ వర్షముల్ ఘోరతపము
సేయకుండఁగ నమరత్వ శ్రీలఁ బొందె
నెందు నేటికి నాగాంతకుండు గాక!

ఆహా! ఈ లోకైక వీరుని- వినుత భక్తాగ్రేసరుని—విబుధ సంస్తుతవిక్రమరత్నాకరుని—సర్వగుణ గణ మాన్యుని—శేముషీజన విధేయుని—యీ మాతృదాస్యవిమోచన దీక్షావ్రత పరాయణునిఁ గీర్తించిన సకలాఘంబులు భస్మీపటలమై యంతరింపవా? దోషచింతనము లంతర్ధానము కావా? మంగళలక్షణంబులలవడవా? మహోదార, శాంతధీర గంభీరహింసావిదూర భావములంకురింపవా?

(ప్రస్థానము.)



శ్రీ

మాతృదాస్యవిమోచనము.

పంచమాంకము.

ప్రథమరంగము.

వినతకుటీరము. — ప్రభాతము.

[వినత యొక వితర్దికపై కూర్చుండియుండును. గరుడుం డామెచెంత నిలువంబడియుండును. సమీపమున నమృతకలశ ముండును.]

గరు — అమ్మా! అమ్మా! ఆదెసంగనుము. నేఁడీ దృశ్యమెంత మనోమోహనముగా నున్నదమ్మా! (ఉత్సాహముతో)

గీ. దారుణదురంత దుస్సహదాస్యరజని
తెల్లవారెనునా తూర్పు తెల్లఁబాఱె,
వికలజనహృదయాబ్జముల్ వికసమొంద
ప్రాగ్గిరిశిఖ దోఁచె స్వాతంత్ర్యభానుఁడదిగో!

ఆరసాలావనీజశాఖాప్రవిష్టులైన యాద్విజనికరంబులు దాస్యవిమోచనమైనవారికి మామంగళాశీర్వాదంబులని మధురమోహనమంజుల కలకలాలాపంబుల నెట్లు చెప్పక చెప్పుచున్నవి?

విన — ఔనౌను — కాని — తండ్రీ! గరుడా! (ఆనందబాష్పములరాల్చుచు)

గీ. సురలఁ జెండాడి, హరిభక్తిఁ జూరలాడి,
సుధనుగొనివచ్చి నాకిచ్చి శోకమూర్చి,
ముదిమికలుగనియమరత్వపదవిఁగాంచి,
నాకనుల్ జల్లఁగా వచ్చినావు కుఱ్ఱ!

గరు — అమ్మా! మహనీయులగు జననీజనకుల యాశీర్వచనబలుండగు నీకొమరునకు హానివాటిల్లుట శశవిషాణన్యాయముగాదఁటమ్మా.

విన — హానివాటిల్లకున్నను శ్రీమత్పునా నాయనా! నిన్నానాఁడెంత పాషాణహృదయనై పోయి పోరి పోరికిఁబంపితినిరా! అబ్బ!

గీ. పటుబలాఢ్యుల విబుధుల నెటులనీవు
భయదసంగ్రామభూమిని ప్రాభవముఁ
దాకియోర్వఁగజాలితో తండ్రి! నిన్ను
పెండ్లికై కట్టులప్పుడు వెడలుమంటి!

గరు — తల్లీ! దానికై నీవు చింతింపఁదగదు. ఏమా, నేను నిరపాయంబుగ విజయేందిరఁగొనిమఱలివచ్చితిని. మఱియు మహాత్ములైన కేశవశతమఖ్యాదులకృపకుఁబాత్రుఁడనైతిని. ఇంతియేగాక

సీ. అమితదయతోఁ గాంచి యాదరించుచుఁ బెంచు
తల్లినిమించిన దైవమెవరు?
ఆపదలనుబాపి యరసిరక్షించెడు
తల్లినిమించిన దైవమెవరు?
తనయుబాగోగు లెతనివిగాభావించు
తల్లినిమించిన దైవమెవరు

తండ్రికన్న ను బాధ్యతనుబూని గాచెడు
తల్లినిమించిన దైవమెవరు ?
'మాతృదేవోభవ', యని మహితశ్రుతులు
ఎవ్వరిఁ గూర్చి నుడువునా యవ్వకంటె
ఇతరమింకేమి కలదు నాకీజగమున
నంతకన్న మహోత్తరంబైన దమ్మ.

గీ. ఎవఁడు జననిని చెఱఁబెట్టి యెదురులాడు
అతఁడు నిష్కృతి లేనట్టి యఘమునొందు
ఎప్పుడెవ్వాఁడు మాతకు మెప్పుసేయు
వాఁడు స్వర్గీయసుఖముల బడయుఁగాదె !

అందువలన నీవాక్యములు నాకెప్పుడును శిరోవతంసములు సుమా.

విన — (గరుడు నక్కునఁ జేర్చికొని) కుమారా ! నీయట్టి ధైర్య స్థైర్యములు, మాతృభక్తి, వివేకముగల సుతులు కలిగిన పిదప గూడ నాకు విచారముండునా ?

గరు — (ఉద్వేగముతో) అమ్మా ! అట్లు కాకున్న —

గీ. తల్లివాంఛను దీర్పని తనయుఁడుండు
కంటెయూడిన మేలగుఁ గాదె తల్లి !
అందుసందునకుఁ జెడియతఁడు తల్లి
కడుపుచెడబుట్టినేగాని కలదె ఫలము ?

విన — ఔను నాయనా ! " తల్లిచెవులగోసినవానికి పినతల్లి చెవులుల్లిపువ్వుల" నునట్లు కన్నతల్లియందే భక్తిలేనివారలకు తమదేశము, తమరాజు, తమప్రజ, తమసంతానము, లను మాటయుండునా ? ఈగుణములు లేనివాఁడు స్వైరిణీకన్న యధముఁడై లోకకంటకుఁడై యూరుపేరుకూడ లేకుండ నశించిపోవుననుటకు సందేహమున్నదా ?

ఉ. ఎందఱుబుట్ట రెందఱుగతింపరు వారల నెవ్వరేసియున్
డెందమటన్న నొక్కపరి వీనులవిందుగ సంస్తుతింతురే ?
పందలు మాతృద్రోహులగు వారలకింతయుఁ గీర్తియుండునే?
నిందలు మాత్రముండు నెడ నిల్చును లోకములుండునంతకున్

గరుడా ! ఇంక మనము స్వతంత్ర జీవనంబులఁ జేసికొందుము. మనల నింక శాసించువారెవ్వరు లేరు. మన మెట్టకేలకు కష్టసముద్రము నుత్తరించితిమి. మనకన్న నింకెవ్వ రెక్కుడు సౌఖ్యము ననుభవింతురు ? మన మింక నెవ్వరికి భీతిల్లవలయును ? (నిట్టూర్పు విడిచి) అమృతమును వారి కెప్పుడిచ్చెదవు ? వారిచే నామాట రవ్వంతయు ననుపించుకొనిన మంచిది కాదా ? 'శుభస్యశీఘ్రమ్మ' ని పెద్దలు పల్కుదురు.

గరు — ఈక్షణముననే పోయి మన బానిసకుబుసమును విడిచివేయుదము. అమ్మా ! బానిసతనముకన్న చావుమేలని నాకొక్కొక్కప్పుడు తోఁచుచుండును.

గీ. గౌరవసుఖంబులనునవి కాల్చివేసి,
మూఁడులోకంబులందు నముప్పుగూర్చి
జీవులను జేతువీవు నిర్జీవులుగను,
నీకు మాకు దాస్యంబ ! విడాకులింక !!!

(అమృతకలశము నెడమచేతితోఁ దీసికొని తల్లిని కుడిచేత పట్టుకొని మెల్లఁగఁ దీసికొనిపోవును.)

(అవనిక వ్రాలును.)

ద్వితీయరంగము.

కద్రువకుటీరము. — ప్రభాతము.

[కద్రువ : కర్కోటకుఁడు కొందఱునాగులు సభతీరియుందురు.]

కద్రు — తనయులారా ! మనపుణ్యము పండినది.

గీ. కద్రునాగవినిర్మిత కఠినవ్యూహ
జాలములమృతంబను చక్కనైన
ఎఱనుదినఁబోయిచిక్కెను మఱలిరాదు
గరుడసింహము, మనకిఁకకలుగుముదము.

కర్కో — నిజము నిజము. మన పాచిక చక్కగాపారినదనుట కిసుమంతయుసంశయింపవలసినపనిలేదు. ఈయల్పాండజమేమి ఇంద్ర, సుర, యక్ష, సిద్ధ, సాధ్య, విద్యాధర, కింపురుషాదివీరలోకసురక్షితంబైన సుధను తెచ్చి మనకిచ్చుటయేమి? మనమనుకొన్నట్లీయమాయకుఁడు తనబల మసమానమనుకొని వారితోఁ బోరియుండెనా తప్పక యీసరికిమడసియుండును. మనశనిదానితోవదలిపోవును. ఒకవేళనీతఁడెల్లరకసాధ్యుఁడై యమృతమును గొనివచ్చి మనకిచ్చెనా దానిని ద్రావియీతనివంటివారల నొకలక్షమంది నవలీలదునుమాడి చతుర్దశభువనంబులగలంచి పారవేయఁగలనిరవధికబాహుబలసంపన్నులమై హాయిగ నిరంకుశముగ లోకంబులన్నిటిఁ బాలింపవచ్చును. తల్లీ! నీవేమందువు? సోదరులారా! మనయభిమతమిదియేగద?

నాగు— హాయి! హాయి! మనకోరికలీడేరుగాక! పెద్దన్నశేషుఁడీమాత్రపుటుపదేశముల నెన్నఁడుచేయలేదు. నీయభిప్రాయమే మాయభిప్రాయము. నీవాక్యములు మనకులమభివృద్ధిఁగాంచుటకు మార్గదర్శకములైయున్నవి.

కద్రు — కర్కోటకా! నీపలుకులు, నీదూరదృష్టికి, నీకుశాగ్రబుద్ధికి, నీవివేచనాసామర్థ్యమునకు ద్యోతకములుగా నున్నవి. బాగు. బాగు.

కర్కో— తల్లీ! ఎప్పుడుకోపమువచ్చి మనలనందఱ నీగరుడుఁడు తనపొట్టబెట్టికొనునోయని నేను భయభ్రాంతుఁడనైపోయెడివాఁడను. వాఁడు తప్పక దేవతలచేచంపఁబడియుండునని నేఁడి నమ్మకముచేత

నాకిప్పుడు కావలసినంత ధైర్యము కలిగినది. అమృతపానమువలన నింక బలమునకుత్సాహముకూడ కలుగవలయును.

నాగు—ఆనాఁడే మనకు సుదినము. మనకుగరుడపిశాచము వదలినట్లేనా?

కద్రు—ఇంకను సందేహమా?

కర్కో—నాజోస్యమసత్యమగుట యేనాఁడైననున్నదా?

కద్రు—(కలవరపాటుచే) అదిగో! తనయులారా! అటుచూడుఁడు. వినతాదాసితోఁగూడ వచ్చునాతఁడెవరు? గరుత్మంతుఁడేనా? నాకుభ్రమయోకలయోకలుగుట లేదుకద?

నాగు—(ముందునకునిదానించిచూచి) ఔనౌను. గరుడుఁడే! ఏమిగతి?

కర్కో—అప్పుడేమరచితిరా! వానిచేతిలోనిది అమృతకలశము. దానినిద్రాగిన వానిభయము మనకేమి?

నాగు—ఔనౌను. సుధనిచ్చినప్పుడు వానికి మనమేమికృతజ్ఞతా వాక్యములు పలుకవలయునో చెప్పెదవా?

కర్కో—ఛీ! మనసేవకునకు మనముకృతజ్ఞతా వాక్యములు చెప్పవలయునా? ఏమియజ్ఞత!

కద్రు—(స్వగ) ఏమిది! వీనినిఁజూచినంతనే నాకనులుమండిపోవుచున్నవేమి? ఇదివీనిదుర్నిరీక్ష్యతేజోఫలమా! వీనికింత తేజమెక్కడిది? లేదు లేదు. నాకనులువ్యాధిగ్రస్తములైనట్లున్నవి. (ప్రకా) కుమారులారా! వానిచేతిలోనిదమృతకలశమేనా?

నాగు—ఆఁ. ఆఁ. మనపుణ్యము పండినది,

కర్కో—సోదరులారా! నేనువచించినదంతయు నిజమైనది చూచితిరా? ఈవిషయములో మీరెల్లరు నేనుచెప్పినట్లు నడువవలయునుసుఁడీ!

[ప్రవేశ; వినత; గరుడుఁడమృతకలశముతో]

గరు—(స్వగ)ఇంద్రుఁడు నన్ను దురాత్ముఁడన్నచోటనే మహాత్ముఁడనినాఁడు. కాద్రవేయులు,కద్రువ,వినతాదాసి యన్నచోటనే వినతాదేవియందురు. ఏమి కాలమాహాత్మ్యము? (ప్రకా)అమ్మా! వీరందఱిక్కడనున్నారు మనపని క్షణములో తీరిపోవును.

విన—అంతకన్న కావలసిన దేమున్నది?

గరు
విత } —(కాద్రవేయులసమీపింతురు)

నాగు—గరుడా! ఆయమృతకలశము నిటు తెమ్ము.

కద్రు—తనయులారా! అన్నిటికి పెద్దదానను నేను లేనా? మీరూరకొనుఁడు. గరుడా! ఆకలశమునిట్లిమ్ము.

కర్కో—ఛీ! మీకింత వరకు నేను చెప్పినదిదియా? మీరెవ్వరు వలదు. అమ్మా! నీకెందుకీగొడవ. గరుడా! ఆసుధనిటు తే. ఊఁ?

విన—అమ్మా! కద్రూ! ఈతఁడాసుధనుమీకి—

గరు—(అర్ధోక్తిలోవినయముతో) అమ్మా! నీవువీరితోనేమియుమాటాడకుము. వీరితో చెప్పవలసిననాల్గుమాటలు చెప్పి వారివలన వినవలసినవికూడ వినిననేగానివీరికమృతమీయరాదు.

కర్కో—(విసుపుతో) నీకీయాలస్యము—

గరు—నాప్రశ్నలకు ప్రత్యుత్తరములిచ్చిన సుధను మీకిచ్చెదము.

కర్కో—ఏమాధర్మసందేహములు?

గరు—మదీయమాతృదాస్యవిముక్తికిగానుమీరు కోరినసుధను తెచ్చిమీకిచ్చుచున్నాను. ఈక్షణమున—

నాగు—తెమ్ము. తెమ్ము. వేగమిటు తెమ్ము.

గరు—(నాగులనుతీవ్రముగాచూచి) విశేషించిమాటాడినమాటదక్కదు. వినుఁడు. ఈక్షణముననే మీరెల్లరుమాతల్లినిదాస్యమునుండివిముక్తురాలిని జేసినట్లును సోదరీమాతృభావమున గౌరవించునట్లును పంచభూతములుసాక్షిగా ప్రతిజ్ఞచేయుఁడు అప్పుడు మీకమృతమునిచ్చెదను,

అందఱు—అంగీకారమే. అంగీకారమే.

కద్రు—పంచభూతములుసాక్షిగా ప్రతిజ్ఞచేసి చెప్పుచున్నాను. అమృతము మాకందినక్షణమునుండియు మీరిరువురు దాస్యవిముక్తులైనట్లుంచెదము. మీజీవితములను పిదపయెట్లుగడపికొనినను మాకునిమిత్తములేదు. ఆలస్యముచేయక వెంటనే సుధనొసఁగుము.

నాగు—గరుడా! దానినిమేము పదిలపరచుకొనవలయును. ఇటు తెమ్ము (చేతులుచాపుదురు.)

గరు—దీనిసుఖమును మీరుపూర్ణముగా ననుభవింపఁగలరు. అదినిశ్చయము. అట్టియెడనున మీకీతొందరయేల? (అమృతకలశమునుపైకెత్తిచూపి)ఇదిగో! ఈయమృతము మిక్కిలిపవిత్రమైనపదార్థము. సాధారణజనదుర్లభంబైనది. దీనిమాహాత్మ్యమును దెలిసికొనుఁడు.

సీ. దీనిఁబడయఁగసుఁడీ దివిషదాసురకోటి
తరచిరిక్షీర సంద్రంబుమునుపు,
దీనికొఱకేసుఁడీదేవ దానవరక్త
వాహినుల్ బారె ప్రపంచమంత
దీనిఁద్రావఁగసుడీ దేవేంద్రుఁడాదిగా
సురలోకమెల్లను శూరులైరి,
దీనిఁగ్రోలఁగసుఁడీ దేవతాపదవి, లో
కంబులలో గౌరవంబుగలుగు,

చవిఁగొనినంత దీనినిచావురాదు
ముదిమియెన్నఁడురాదు ప్రమోదమబ్బు,
బలమురూపముజవమును కలుగు, నరయ
నమృతముసాటి వస్తువీయవనిఁగలదె?

దీనిని భూతలమందుంపరాదు. పోయి కొన్నిదర్భలఁ గొనిరండు. ఆకుశాస్తరణమునదీనినుంతును.

నాగు—(కొందఱులోనికిఁ బోయి దర్భలఁ దెచ్చి యొక ఆస్తరణంబును జేయుదురు.)

కద్రు—గరుడా! సుధాకలశము నందుంచుట కాలస్యమేల?

గరు—అట్లే! కాని మీరు దీనిని పరమపవిత్రతనుబొందినఁగాని తాకరాదు. ఉపయోగింపరాదు. కాఁబట్టిమీరు వేగ నదీజలస్నానంబునఁబునీతులై యీసుధారసంబునుగ్రోలుఁడు. ఇదిగోదీనినీప్రదేశమున నుంచుచున్నాను. (కుశాస్తరణమునసుధనుంచును.) మీవస్తువ మీకందినదా? మేము స్వతంత్రులమై యథేచ్ఛనుపోవచ్చునా?

అందఱు—వెంటనే పొండు. మావస్తువ మాకు చేరినది. మీకు మీస్వాతంత్ర్యమువచ్చినది.

గరు—అమ్మా! రమ్ము. పోదము.

[గరుడుఁడు: వినత; నిర్గమింతురు. దూరమునసింద్రుఁడురహస్యముగదాగియుండును. కద్రువనాగులుసంతోషముతో తొట్రుపాటుపడుచునిష్క్రమింతురు. ఇంద్రుఁడమృతకలశమునుసమీపించును.]

ఇంద్రు—(నలువైపులఁజూచి) ఎవ్వరును లేరుగద! ఏమినాఅదృష్టము! (సుధాకలశమును చేతఁగొని) గరుడునిదయవలననష్టధనప్రాప్తి కలిగినది. నేఁడేమిపుణ్యముజేసితిని! ఈకాద్రవేయులెంతమూర్ఖులో? ఒక్కరును కావలిలేకుండఁనీయమూల్యపవిత్రపదార్థమును విడిచిస్నా

నముచేయఁబోయినారు! ఏదియెట్లైన నారొట్టివిరిగి నేతిలో బడినది. దైవానుగ్రహమిట్లుగదాయుండవలయును? సుధాకలశము నమరలోకమునభద్రపరచుకొనివచ్చి గరుడునాశీర్వదించిపోయిన నాకింకనిరపాయమగును. హా! ఏంతలోదుఃఖము—ఎంతలోసుఖము ననుభవించుచున్నాను?—ఈశీతాతప, రాత్రిందివ, సుఖదుఃఖాదిద్వంద్వములీశ్వరలీల? ప్రకృతిధర్మములా? (ప్రస్థానము)

(కద్రువ; కర్కోటకుఁడు తడిబట్టలతో కొందఱు నాగులు ఒకరినొకరుత్రోసికొనుచు, కలవిలపడుచు కలహించుచు దూరమునప్రవేశింతురు.)

మొ. నాగు—అందులోసగము నాకేరావలయును.

రెం. నా—వేవురుండఁగ సగమునీకెట్లువచ్చును?

మూ. నా—సగమునకు సగము నీకెందులకు?

నా. నా—ఎందుకేమినీమొగము. ఎంతత్రాగిన నంతమంచిదిరా?

మొ. నా—నాకుమీవాదములతోపనేమి? నాభాగమునేను పుచ్చుకొనితీరెదను.

మూ. నా—అట్లయిన నాకునంత భాగమేరావలెను.

రెం. నా—మీరిరువురుచెరిసగముగైకొని మాకేమిపంచియిచ్చెదరు?

నా. నా—న్యాయాధిక్యత మీరుగమనించి సింహభాగము నాకిడవలయును.

మూ. నా—కర్కోటకునికి యౌజమాన్యమిచ్చివానిచిత్తమెట్లోయట్లేపాలిడమందము. దానికిమీరుసమ్మతింతురా?

కర్కో—ఔనౌను. ఇదిమిక్కిలి సమంజసమైనపద్ధతి. మీరె

ల్లరునా చెప్పినట్లు నడచికొనుఁడు. మీకందఱకు సమముగా పంచిపెట్టెదను.

హా. నా—ఔనిది బాగుగ నేయున్నది. పంచిపెట్టునపుడు నన్నొకకంటను చూడవలెనుసుమా అన్నా!

మొ. నా—ఈపద్ధతి బాగులేదు. అందఱివలె నాకు పాలిడినఁజాలదు. నన్ను ముందుగా సంతృప్తిపరచినగాని మఱియొకదరికి పోవలను గాదు. నీవిది ముందు ముఖ్యముగా గమనించవలసిన విషయము.

ర్కో. నా—ఛీ! ఛీ! దౌర్భాగ్యురాలా! మనకు కర్కోటకుఁడు పంచిపెట్టఁదగునా?

గీ. మనవిభాగంబులను నెల్లమాతసేయ
యుక్తమగు నన్ని విధముల నురగులార!
చెల్లునే యన్న పాలిడ నెల్లరకును
జ్ఞాతికరయంగ కంటవిషంబుగాదె?

కద్రు—తనయా! చక్కఁగఁ జెప్పితివి. నీహితము యుక్తముగా నున్నది. కర్కోటకా! తక్షకా! వాసుకీ! ధనంజయ! మణినాగా! కాళియ! మీరందఱొక్కింత దూరమున నుండుఁడు. నేనందఱకు సమానముగ నిష్పక్షపాతముతో పంచిపెట్టెదను.

కర్కో—(కోపముతో) ఛీ! ఛీ! నీవు ద్రోహకురాలవు! మేకవన్నె బెబ్బులివి! నిన్ను నమ్మవలసిన పనిలేదు. అందఱితో పాటు నాకు సమానముగనా పంచిపెట్టెదవు?

గీ. వినతకను గప్ప మమ్ముల వేడునాడు
నీకుదిక్కయినవారెరో నీకె తెలియు
అట్టి నాకెంత భాగ మీయంగవలెనొ
సుంత యోజింపవే జగజంతకాన?

కద్రు—పాపము! అదినిజమే! వీని నొక కంటఁజూచి శతాంశము వీనికెక్కుడుగా నీయవలెను. శేషుఁడు లేడుకాన వానిభాగము కర్కోటకునికి వాని సాహసకృత్యమునకై పసదనముగా నొసఁగిన తప్పేమి?

మొ. నా—ఛీ! ఛీ! నీనిర్ణయము మాకక్కరలేదు. ఈయన్నగారున్న వాని తలఁదన్నిన మిన్న యింకొకరుఁడీ కార్యమానాఁడే చక్కబెట్టకుండియుండునా యేమి? ఏనాటి మాటలో యిప్పుడు త్రవ్విపోసి కర్కోటకుని మీది ప్రేమాధిక్యతచే వానికి విశేషము కల్పింపఁజూచు నీమె వాక్యములు మనకు హితములు కావు. మీరెవ్వరీవ్యర్థవాక్యములకు మోసపోవలదు. ఎవరికి దొరికినది వారే త్రాగుదము. రండు. రండు. (దర్భలకడకు పరువెత్తిపోవును.)

నాగులు—ఔనౌను. అదే మంచి మార్గము. (దర్భలకడకు పరువెత్తుదురు.)

కర్కో—ఆఁ! ఆఁ! అదేమి యాగడము. (దర్భలకడకు పరువెత్తును.)

కద్రు—అయ్యో! అయ్యో! అదేమి పాపము! నాకింతయు మిగల్పకుండ నంతయు మీరే త్రాగెదరా? (దర్భలకడకు పరుగెత్తును.)

నాగులు—(కుశలున్న స్థలమున నమృతము లేకుండుటఁ గాంచి) ఆహా! మోసము, మోసము. అమృతము మాయమైనది!

కర్కో—కుశలకేమైన నంటుకొన్న దేమో!

[అందఱు కుశల చక్కఁగ నాకి నాలికలు రెండుగా చీలికలుగా హా హా కారములు సేయుచు మాటలు తిన్నఁగ రాక సంజ్ఞలచే తమబాధ నొకరితో నొకరు తెలుపుకొనుచు నేలఁబడి దొర్లెదరు.]

(అవనిక పడును.)

తృతీయరంగము.

వినతకుటీరము. — సాయంతనము.

[వినతగరుడులు వ్యాఘ్రాజినములపై గూరుచుండి యుందురు.]

వినత—కుమారా! నాయలమటవోఁగొట్టి నాజీవితకాలమంతయు దిక్కుమాలిన దానినై యగచాట్లు పడుచు నుండకుండ నా గర్భమందు కలిగినందునకు సార్థకముగ నన్ను స్వాతంత్ర్య సామ్రాజ్య పట్టమహిషినిఁగాఁ జేసి కన్నులఁగప్పుకొని కాపాడితివి. నాకిప్పటికిఁ బూర్ణముగ నూరట కలిగినది. తనయా! నిన్ను దేవతలాశీర్వదింతురు గాక!

గరు—అమ్మా! దైవము మనకనుకూలుఁడై యున్నప్పుడు మన ప్రయత్నములు రిత్తవోవునా? అదిగో దివస్పతియగు సహస్రాక్షుఁడును బృహస్పతియునటునిటు వచ్చుచున్నారు. ఏమి మన భాగ్యము?

[ప్రవేశ: దేవేంద్రుఁడు: బృహస్పతి.]

వినత } (ఎదురేగి నమస్కరించి) దివిజాధిపా! సురాచార్యా! మా
గరు } నమస్కారముల నందుకొనుఁడు.

బృహ—! కశ్యపగృహిణీ! నీకు సౌభాగ్యమగుఁగాక! సుపర్ణా! నీకు శుభమగుఁగాక!

ఇంద్ర—దీర్ఘాయురారోగ్యముల నలరారుదురుగాక!

బృహ—సాధ్వీమణీ! వినతాదేవి! నీకు గాక యిట్టిఘనుఁడగు కొమరుఁడే యిల్లాలికి గలిగెను? ఋషిజనతల్లజతపోజనితుండగు నీతఁ డెంతవాఁడని వచింపఁగల్గెను? ఇట్టిమహనీయునిఁగాంచిన నీభాగ్యమే భాగ్యము సుమా!

ఇంద్ర—గరుడా; అమృతమును గొని పోయి త్రిదివమున భద్రపరచుకొని నిన్నాశీర్వదింప మఱలి వచ్చితిని. నీయందలి వాత్సల్యముచే నీవాచస్పతియు నిన్నాశీర్వదింప నిచ్చటకు వచ్చినారు.

విన—ఆర్యులారా! అనుగ్రహింపఁబడితిమి. మీదయాభాగ్యంబున మేమిరువురము సౌఖ్య స్వేచ్ఛా జీవనులమైతిమి. నేఁడు మీదర్శన భాగ్యంబున మేమిరువురము పావనులమైతిమి. అనివార్యకారణమున మాబాలుఁ డొనర్చిన దుండగములను మీరు సైరించి క్షమింప వలెను.

బృహ—అమ్మా! మమ్మందఱ నాతఁడే దయఁజూడ సమర్థుఁడు. మీసుతుని ఘనత నీకేమి తెలియును గాని యాతని నెరులు కాచు పాటివారా? అయిన నీతని యభ్యుదయమే మాకు నిరంతరము వాంఛనీయము సుమీ! మీకష్టములు గట్టెక్కినందు కానందమొందుచున్నాను.

వినత—సురగురూ! ఈదాసీత్వమున మే మెంతనరకమనుభవించితిమో దైవ మెరుఁగును. నీవంటి మహాపండితునకుఁ గూడ వర్ణింపనలవికాని ఘోరదారిద్ర్య దాస్య దుఃఖము నేమని వెళ్ళఁగ్రక్కగలను.

గీ. వాయియుండియు మాటాడవలనుపడదు
ప్రతిభ యున్నను వినియోగ పరుపరాదు
పోవుదమటన్న నెచటికి పోవరాదు
అరయ దాస్యంబు భూలోక నరకముగద

సీ. సౌఖ్యజీవనవల్లిచల్లఁగా తెగఁగోయు
తతలవిత్రంబది దాస్యమనఁగ
నీచప్రవృత్తుల నేర్పుల బంధించు
దారుణరజ్జువుల్ దాస్యమనఁగ
సద్భావమకరంద సంపత్తుఁగ్రోలెడి
దంశ స్తపాళులీదాస్యమనఁగ
సువివేకవృష్టిలో సూటిగాజారెడు
దంభోజిపుంజముల్ దాస్యమనఁగ

కార్యజ్యోతిని యార్పంగాఁ గలుగునట్టి
దారుణానిల వీచికల్ దాస్యమనఁగ
బ్రతుకు బండలుగాఁ జేసి ప్రాణములను
చప్పరించు పిశాచి దాస్యంబెయనఘ.

బృహ—తల్లీ! మీరు బానిసతనంబున నిలుగులఁ బడితిరని వగవఁబని లేదు. వినుమా!

గీ. బానిసతనంబు పొందినవాఁడె స్వేచ్ఛ
వలనసౌఖ్యము పూర్తిగ తెలిసియులరు
నిశనువనమునఁ జరుప్రయాణికున కర్క
బింబమగుపడఁబొంచెడి ప్రీతియట్లు

ఇంక నొక విశేషము గలదు.

గీ. అరయ స్వాతంత్ర్య పథమున హానిమిగుల
ప్రబలమొందును సౌఖ్యమాపదలదాట
సాంద్రనీలాభ్ర పుంజము చాటుచేయ
వాఁడదాటి శోభిలు చంద్రవంకపగిది

వినత—నిజము. నిజము.

గరు—దేవా! దేవాచార్యా! నీవుకూడ నిచ్చటికి శ్రమపడి మమ్మాశీర్వదింప వచ్చుట నిజముగ మాపురాకృత పుణ్యము కాక యేమి? మాయిష్టజీవితముల కింతకన్న దయావృష్టి యేమి కావలయును? నిజముగ నేఁడు మేము కృతార్థులమైతిమి.

ఇంద్ర—గరుడా! నిన్నెంత కీర్తించినను నాకుఁ దనివి తీరదోయి! నీమహత్తర గుణంబు లఖిలలోక వ్యాప్తములై నిఖిలజనసంస్తుతి పాత్రములై దిగంతవ్యాపితయశఃకౌముదీవిరాజమానమై వెలయుచున్నవి.

గీ. ఇంద్రుఁడవు నీవు పక్షులకెల్ల యెడల
శ్రీరమానాథుధ్వజమవు, శ్రీకరుఁడవు
కిల్బిషముబోవ నిన్నుదిఁ గీర్తిసేయ
నహహా! నీభాగ్యమే భాగ్యమయ్యగరుడ!

[సురలు పైనుండి పుష్పవర్షముఁ గురిపింతురు. అంబరవీథిఁబోవుచు నొక యప్సరఃకాంత గరుడుని మెడలో నొక పుష్పహారమువైచి పోవుచు. కొందఱు దేవవేశ్యలు వచ్చి నాట్యముచేసి వెడలిపోనురు.]

ఇంద్ర—అదిగో! దేవవనితలు కూడ నిన్ను మెచ్చి నాట్యముచేసి పోయినారు. పుష్పములతో నలంకరించిరి. ఏమినీభాగ్యము! నీయశస్సాచంద్రతారార్కముగ వెలయుగాక! సువర్ణా! వినతాదేవి! మీకేమి కావలయునో కోరికొనుఁడు.

వినత—అన్నా! మాకేమి కావలయును. నాసుతుని వాంఛితమే నా కోరిక.

బ్రహ్మ—కుమారా! నీకోరిక యేమి?

గరు—దేవగురూ! శ్రీహరిపాదసేవయు, మీతోడి సఖ్యము నుకలిగిన నాకుఁ గోరఁదగినదింకేమున్నది? అయినను మీరిరువు రిట్లనుగ్రహింతురుగాక!

భరతవాక్యము.

మాతృప్రేమను ప్రజలెల్లమనఁబునట్లు,
దాస్యమున నేరుబాధలఁ దన్నలకుండ,
మోసమెల్లెడనశియింప, వాసవా! వ
రములనీయవె? శాంతినిఁ బ్రబలఁజేసి.

ఇంద్ర, బృహ—తథాస్తు! తథాస్తు!

(అందఱు నిష్క్రమింతురు.)

(అవనిక పడును.)

సంపూర్ణము.

తప్పొప్పుల పట్టిక.

పుట.	పంక్తి.	తప్పు.	ఒప్పు.
పాత్రి	౨	౧ కన్యపపత్రిజాపతి	౧. కస్యప ప్రిజాపతి
నాంది	౭	పకృతి	ప్రకృతి
౧	౯	తనయ వై	తనయలై
౨	౬	సెద్ద	పెద్ద
...	౨౫	తనయ	తనయు
౩	౪	యతని	నతని
౪	౨౨	గానితుదకు-	గాని—
౫	౨	దెలియఁజేతు	దెలియు తుదకు.
...	౧౭	పుట్టనుండ	పుట్టనుంట
౮	౧౧	సేఁడుశరణ్యా	నేఁడు నాకుశరణ్యా
౧౫	౩	సాపమ్మతము	నాపమ్మతము
౨౨	౫	చేయుదుము	చేయింతుము
౨౩	౯	నప్పుఁడమ్మా, అమ్మ,	నప్పుఁ డమ్మా! ‘ అమ్మ! ’
౨౬	౧౦	వినతాంబను	వినతాంబను మీరు
౩౮	౨౩	చెప్పుమ. ఇదిపూర్వచరిత్రము.)	చెప్పును.) ఇదిపూర్వచరిత్ర
౩౯	౨౩	చెందు చెండాడు	చెందుబెండాడు
౪౬	౨౦	కాకిరాతులు	కౌకిరాతులు
...	౨౧	మాపు	బాపు
౬౭	౮	ధైర్య	ధైర్య
౬౨	౨	స్థయిర్య	స్థైర్య
౮౬	౧	వినిర్మత	వినిర్మిత
౮౬	౨	జాలముల మృతంబను	జాలముల నమృతంబను
౯౧	౬	లీల ?	లీలలా ?

END OF TITLE